నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ శనివారం 29-1-2022 RNI No.52865/93·Postal No\.H/SD/258/2020-2022 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 సంపుటి :28 సంచిక: 147 పేజీలు: 4 వెల: రూ.1/-

పొలాల్లో కూలిన ఆర్మీ ఎయిర్ క్రాఫ్ట్.. ఇద్దరు ట్రైనీ పైలట్లు సేఫ్..

న్యూఢిల్లీ, జనవరి 28:బిహార్‌లో ఆర్మీ ఎయిర్ క్రాఫ్ట్ కూలిపోయింది. సాంకేతిక కారణాల వల్ల సమీపంలోని పొలాల్లో కుప్పకూలింది. గయాలోని ఇండియన్ ఆర్మీ ఆఫీసర్స్ ట్రైనింగ్ అకాడమీకి చెందిన ఇద్దరు ట్రైనీ పైలట్‌లతో కూడిన ఈ విమానం టేకాఫ్ అయిన కొద్దిసేపటికే కూలిపోయినట్టు సమాచారం. కాగా, ఇద్దరు పైలట్లు సురక్షితంగా ఉన్నారని గయా అంతర్జాతీయ విమానాశ్రయం డైరెక్టర్ బంగాజీత్ సాహా తెలిపారు.

పైలట్లు ఎమర్జెన్సీ ల్యాండింగ్ చేసేందుకు ప్రయత్నించినప్పుడు బోధ్‌గయా బ్లాక్‌లోని ఒక గ్రామాన్ని ఆనుకుని ఉన్న పొలాల్లో ఈ ప్రమాదం జరిగిందని ఆయన చెప్పారు. ట్రైనర్ విమానం కిందపడడాన్ని గమనించిన గ్రామస్థులు ఘటనాస్థలికి చేరుకుని క్యాడెట్లను బయటకు తీశారు. వెంటనే అక్కడికి చేరుకున్న ఆర్మీ సిబ్బంది వారిని తీసుకెళ్లారు. కూలిపోయిన విమానం శిథిలాలను కూడా వారు సేకరించారు. "క్రాష్‌కు సాంకేతిక లోపమే కారణమని, దానికి సంబంధించిన వివరాలు నిపుణుల పరిశీలన తర్వాత తెలుస్తుంది" అని విమానాశ్రయ డైరెక్టర్ చెప్పారు.

సామాజిక ఉద్యమంగా మలిచిన రోజే డ్రగ్స్ కంట్రోల్ సాధ్యం : కేసీఆర్

హైదరాబాద్, జనవరి 28:పోలీస్ అధికారులు వినూత్నరీతిలో బాధ్యత కలిగిన మానవులుగా ఆలోచనలు చేయాలని, సామాజిక బాధ్యతతో ప్రతి ఒక్కరి సహకారం తీసుకొని సామాజిక ఉద్యమంగా మలచినరోజే డ్రగ్స్ కంట్రోల్ సాధ్యమవుతుందని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు రాష్ట్ర పోలీసు, ఎక్సైజ్ శాఖ అధికారులకు పిలుపునిచ్చారు. నమీక్షలో సీఎం కేసీఆర్ మాట్లాడుతూ?తెలంగాణ రాష్ట్రంలో శాంతిభద్రతలు అద్భుతంగా అమలవుతున్న నేపథ్యంలోనే రాష్ట్రం అనతికాలంలో అత్యద్భుతంగా అభివృద్ధి పథాన దూసుకుపోతుందని సీఎం అన్నారు. నార్కోటిక్ డ్రగ్స్ వాడకం అనేది ప్రపంచ వ్యాప్తంగా విస్తరిస్తున్న దుర్వ్యసనమని, సమాజమనే వేరుకు పట్టిన చీడ పురుగు వంటిదని సీఎం తెలిపారు. ప్రజలను డ్రగ్స్ కు వ్యతిరేకంగా చైతన్యం చేసేందుకు సృజనాత్మక కార్యక్రమాలను రూపొందించాలని సీఎం కేసీఆర్ అన్నారు. 1000 మంది సుశిక్షితులైన పోలీస్ సిబ్బందిని ప్రత్యేకంగా నియమించుకుని అత్యాధునిక హంగులతో కౌంటర్ ఇంటెలిజెన్స్ సెల్ ను ఏర్పాటు చేసుకోవాలని డీజీపీ మహేందర్ రెడ్డి ని సీఎం కేసీఆర్ ఆదేశించారు.

ఇప్పటికే పలు అసాంఘిక శక్తులను వ్యవస్థలను నిర్వీర్యం చేసేందుకు ఏర్పాటు చేసుకున్నగ్రే హౌండ్స్ తదితర వ్యవస్థలు విజయవంతంగా పనిచేస్తున్నాయని, అదే మాదిరి, నార్కోటిక్ డ్రగ్స్ ను నియంత్రించే విభాగం కూడా శక్తి వంతంగా తేజోవంతంగా పని చేయాలన్నారు. అద్భుత పనితీరు కనపరిచే పోలీస్ అధికారులకు అవార్డులు, రివార్డులు ఆక్సెలరేషన్ ప్రమోషన్స్ తదితర అన్ని రకాల ప్రోత్సాహకాలను అందించాలన్నారు. ఇందుకోసం కావాల్సిన నిధులను ప్రభుత్వం సమకూరుస్తుందని సీఎం కేసీఆర్ స్పష్టం చేశారు. డ్రగ్స్ నియంత్రణ విషయంలో ఎంతటి వారినైనా ఉపేక్షించవద్దని, ఈ విషయంలో ఏ పార్టీకి చెందిన వారైనా సరే, నేరస్థులను కాపాడేందుకు ప్రజాప్రతినిధుల సిఫారసులను నిర్దాందంగా తిరస్కరించాలని పోలీసు అధికారులకు సీఎం స్పష్టం చేశారు.

రాష్ట్రంలో గంజాయి తదితర నార్కోటిక్ డ్రగ్స్ వినియోగాన్ని కూకటివేళ్లతో పెకిలించాలనే లక్ష్యంతో శుక్రవారం ప్రగతిభవన్ లో సీఎం కేసీఆర్ అధ్యక్షతన 'రాష్ట్ర పోలీసు ఎక్సైజ్ అధికారుల సదస్సు జరిగింది. ఈ సదస్సులో రాష్ట్ర మంత్రులు మహమూద్ అలీ, వి.శ్రీనివాస్ గౌడ్, వేముల ప్రశాంత్ రెడ్డి, చామకూర మల్లారెడ్డి, ఎంపీలు బీబీ పాటిల్, కవితా నాయక్, ఎమ్మెల్యేలు బాల్క సుమన్, రెడ్యానాయక్, రవీంద్ర కుమార్ నాయక్, ఆళ్ల వెంకటేశ్వర్ రెడ్డి, రాజేందర్ రెడ్డి, గాదరి కిశోర్ కుమార్, సాయన్న, రేఖా నాయక్, అబ్రహం, హన్మంతు షిండే తదితరులు పాల్గొన్నారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేశ్ కుమార్, డీజీపీ మహేందర్ రెడ్డి, హైదరాబాద్ సిటీ పోలీస్ కమిషనర్ సి.వి.ఆనంద్, సైబరాబాద్ పోలీస్ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర, రాచకొండ పోలీస్ కమిషనర్ మహేశ్ భగవత్, సీఎంవో అధికారులు నర్సింగ రావు, భూపాల్ రెడ్డి, హోంశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ రవిగుప్తా పోలీస్ శాఖకు చెందిన రాష్ట్ర స్థాయి, జిల్లాస్థాయి, ఎస్పీలు, కమిషనర్లు, డీసీలు పాల్గొన్నారు. ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ డైరెక్టర్ సర్ఫరాజ్ అహ్మద్, కమిషనర్లు, డీసీలు తదితరులు పాల్గొన్నారు.

ఈ నెల 31 నుంచి స్కూళ్లను తెరుస్తారా? : హైకోర్టు

హైదరాబాద్, జనవరి 28: కరోనా కేసుల నియంత్రణపై ఇవాళ హైకోర్టులో విచారణ కొనసాగింది. ఈ నెల 31 నుంచి స్కూళ్లను తెరుస్తారా? అని హైకోర్టు ప్రశ్నించింది. వారాంతపు సంతల్లో కరోనా కట్టడికి ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారో చెప్పాలంటూ సర్కారును ఆదేశించింది. నమ్మక్క సారక్క జాతర ఏర్పాట్లకు సంబంధించిన నివేదికను సమర్పించాలని ఆదేశాలిచ్చింది.

రాష్ట్ర హెల్త్ డైరెక్టర్ శ్రీనివాసరావు ఆన్ లైన్ లో విచారణకు హాజరయ్యారు. రాష్ట్రంలో పాఠశాలల పున:ప్రారంభంపై ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని హైకోర్టుకు తెలంగాణ ప్రభుత్వం తెలియజేసింది. రాష్ట్రంలో ఇప్పటిదాకా 77 లక్షల ఇళ్లలో ఫీవర్ సర్వేలో 3.45 లక్షల మెడికల్ కిట్లను పంపిణీ చేశామని హైకోర్టుకు నివేదించారు. పాజిటివిటీ రేటు 3.16 శాతంగా ఉందన్నారు. పిల్లలకు సంబంధించిన మందులను కిట్లలో నేరుగా ఇవ్వడానికి లేదని చెప్పారు. అయితే, దానికి సంబంధించిన పూర్తి వివరాలతో నివేదిక సమర్పించాలని హైకోర్టు ఆదేశించింది. తదుపరి విచారణను ఫిబ్రవరి 3కి వాయిదా వేసింది.

దేశం యొక్క సరిహద్దు ప్రాంతాలలో ఒక లక్ష మంది కొత్త కేడెట్‌లను సంసిద్ధంగా ఉంచడమైంది- ప్రధానమంత్రి

న్యూఢిల్లీ, జనవరి 28:కరియప్ప గ్రౌండు లో జరిగిన నేషనల్ కేడెట్ కోర్ ర్యాలీ ని ఉద్దేశించి ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ ప్రసంగించారు. గౌరవ వందనాన్ని ప్రధాన మంత్రి పరిశీలించడం తో పాటు గా, ఎన్ సిసి దళాలు జరిపిన కవాతు ను కూడా ఆయన సమీక్షించారు. సైనిక కార్యాచరణ, స్లిదరింగ్, మైక్రోలైట్ ఫ్లయింగ్, పారా సెయిలింగ్, ఇంకా సాంస్కృతిక కార్యక్రమాల లో ఎన్ సిసి కేడెట్ లు వారి యొక్క నైపుణ్యాల ను ప్రదర్శించడాన్ని కూడా ఆయన గమనించారు. ఉత్కృష్ట కేడెట్ లు ప్రధాన మంత్రి వద్ద నుంచి పతకాన్ని, బేటన్ ను స్వీకరించారు.

ఈ సందర్భం లో సభికుల ను ఉద్దేశించి ప్రధాన మంత్రి ప్రసంగిస్తూ, ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ ను దేశం జరుపుకొంటున్న వేళ ఉత్సవాల లో ఒక విభిన్న స్థాయి ఉత్సాహం తొణికిసలాడుతోందన్నారు. ఎన్ సిసి తో తనకు గల అనుబంధాన్ని ప్రధాన మంత్రి సగర్వం గా గుర్తు కు తెచ్చుకొన్నారు. దేశ ప్రజల పట్ల తనకు గల బాధ్యతల ను నెరవేర్చడం కోసం శక్తి ని ఇస్తున్న ఖ్యాతి ఎన్ సిసి కేడెట్ గా తాను పొందిన శిక్షణ కు దక్కుతుంది అని ఆయన అన్నారు.

దేశ నిర్మాణం లో లాలా లాజ్ పత్ రాయ్ గారు మరియు ఫీల్డ్ మార్శల్ కరియప్ప గారు లు అందించిన తోడ్పాటుల కు గాను ప్రధాన మంత్రి వారి కి నివాళు లు అర్పించారు. ధైర్యవంతులైన ఈ ఇరువురు భారతదేశ పుత్రుల జయంతి ఈ రోజున నే కావడం గమనించదగ్గది.

కొత్త సంకల్పాల తో దేశం ముందుకు సాగిపోతున్నటువంటి కాలం లో ఎన్ సిసి ని బలోపేతం చేయడం కోసం చేపడుతున్న చర్యల ను గురించి ప్రధాన మంత్రి ప్రస్తావించారు. దీనికోసం, దేశం లో ఒక ఉన్నత స్థాయి సమీక్ష సంఘాన్ని ఏర్పాటు చేయడమైందన్నారు. గడచిన రెండు సంవత్సరాల లో, ఒక లక్ష మంది కొత్త కేడెట్ లను దేశ సరిహద్దు ప్రాంతాల లో తీర్చి దిద్దడమైందని ఆయన అన్నారు.

రక్షణ సంస్థ ల ద్వారాల ను అమ్మాయి ల కోసం, అలాగే మహిళ ల కోసం తెరచి ఉంచడం కోసం తీసుకొంటున్న నిర్ణయాల ను గురించి ప్రధాన మంత్రి వివరించారు. కేడెట్ లలో అమ్మాయి లు పెద్ద సంఖ్య లో ఉండటాన్ని ఆయన గమనించి, ఇది దేశ ప్రజల వైఖరి లో వస్తున్న మార్పునకు ఒక సంకేతం అని అభివర్ణించారు. "మీ తోడ్పాటు దేశాని కి అవసరం. మరి దీని కోసం అనేకమైన అవకాశాలు ఉన్నాయి" అని కేడెట్ లలోని అమ్మాయిల తో ఆయన చెప్పారు. ప్రస్తుతం దేశం లోని కుమార్తె లు సైనిక్ స్కూళ్ళ లో ప్రవేశాలు తీసుకొంటున్నారు, మరి మహిళ లు సైన్యం లో ప్రధానమైన బాధ్యతల ను స్వీకరిస్తున్నారు అని ఆయన అన్నారు. దేశం లో కుమార్తె లు వాయుసేన లో యుద్ధ విమానాల ను సైతం నడుపుతున్నారు. "ఈ తరహా స్థితి లో మరింత మంది కుమార్తెల ను ఎన్ సిసి లోకి చేర్చుకోవాలి అనేది మన ప్రయాస కావాలి" అని ఆయన చెప్పారు.

కేడెట్ లలో యువత ప్రాతినిధ్యాన్ని గురించి ప్రధాన మంత్రి గమనించారు. వారి లో చాలా మంది ఈ శతాబ్ది లో జన్మించిన వారే అని ఆయన అన్నారు. దేశాన్ని 2047వ సంవత్సరం లోకి తీసుకు పోవడం లో యువత భూమిక ను గురించి ప్రధాన మంత్రి నొక్కిచెప్పారు. "మీ యొక్క ప్రయాస లు, మీ యొక్క సంకల్పం, మరి ఆ సంకల్పాల ను నెరవేర్చడం..ఇవి భారతదేశం యొక్క కార్యసిద్ధి, భారతదేశం సాఫల్యం అవుతాయి" అని ఆయన అన్నారు. ఏ దేశం లో అయితే యువత దేశ ప్రజల కే మొదటి ప్రాధాన్యం అనేటటువంటి ఆలోచన వైఖరి తో ముందుకు సాగుతుందో అటువంటి దేశాన్ని ప్రపంచం లో ఏ శక్తి కూడాను ఆపజాలదు అని ప్రధాన మంత్రి అన్నారు. ఆట మైదానం లో మరియు స్టార్ట్-అప్ ఇకోస్పియర్ లో భారతదేశం యొక్క సాఫల్యం ఈ విషయాన్ని చాలా స్పష్టం గా వివరిస్తోందని ప్రధాన మంత్రి అన్నారు. 'అమృత కాలం' లో అంటే, వర్తమానం నుంచి మొదలు పెడితే రాబోయే 25 సంవత్సరాల లో, దేశం యొక్క ఆకాంక్షల తో, దేశం యొక్క అభివృద్ధి తో కేడెట్ లు వారి కార్యాచరణల ను, ఆకాంక్షల ను పెనవేసుకోవాలి అని ప్రధాన మంత్రి విజ్ఞప్తి చేశారు. 'వోకల్ ఫార్ లోకల్' ప్రచార ఉద్యమం లో నేటి యువజనులు పోషించదగిన ప్రధాన పాత్ర ను కూడా ప్రధాన మంత్రి స్పష్టం చేశారు. "భారతదేశం లో ఉండే వ్యక్తి యొక్క శ్రమ తో, స్వేదం తో రూపుదిద్దుకొన్న వస్తువుల ను మాత్రమే ఉపయోగించుదాం అని నేటి యువత సంకల్పాన్ని తీసుకొంటే గనక భారతదేశం యొక్క భవితవ్యాన్ని మార్చవచ్చును" అని ఆయన దృఢం గా చెప్పారు.

ప్రస్తుతం ఒక పక్క డిజిటల్ టెక్నాలజీ కి, సమాచారానికి సంబంధించి మంచి అవకాశాలు ఉంటే, మరో పక్క దుష్ప్రచారం తాలూకు అపాయాలు పొంచి ఉన్నాయి అని ప్రధాన మంత్రి వ్యాఖ్యానించారు. మన దేశం లో సామాన్య మానవుడు ఎటువంటి వదంతి యొక్క ప్రభావం లోనూ పడకపోవడం అనేది కూడా అవసరం అని ఆయన నొక్కిచెప్పారు. దీనికి గాను ఒక చైతన్య కారకమైనటువంటి ప్రచార ఉద్యమాన్ని ఎన్ సిసి కేడెట్ లు నిర్వహించాలి అంటూ ఆయన ప్రతిపాదించారు.

ఎన్ సిసి గాని లేదా ఎన్ ఎస్ఎస్ గానీ ఉన్న పాఠశాల లోకి/కళాశాల లోకి మత్తు పదార్థాలు చేరకూడదు అని ప్రధాన మంత్రి స్పష్టం చేశారు. కేడెట్ లు వారంతట వారు మాదక ద్రవ్యాల జోలికి పోకూడదు, మరి అదే కాలం లో వారి విద్యాసంస్థల ఆవరణల ను డ్రగ్స్ కు తావు ఉండనివి గా తీర్చిదిద్దాలి అంటూ ఆయన సలహా ను ఇచ్చారు. ఎన్ సిసి లో లేదా ఎన్ఎస్ఎస్ లో లేనటువంటి మిత్రులు సైతం ఈ చెడు అలవాటు ను వదలి వేసేటట్లు గా వారి కి సాయం చేయండి అని ఆయన నొక్కిచెప్పారు.

దేశం లో ఉమ్మడి ప్రయాసల కు ఒక కొత్త శక్తి ని ఇవ్వడం కోసం కృషి చేస్తున్నూపశ్రీట4ూనీఇ తివబిఎ పోర్టల్ తో అనుబంధాన్ని కలిగి ఉండాలి అని కేడెట్ లకు ప్రధాన మంత్రి సూచన చేశారు. ఈ పోర్టల్ తో 7 వేల కు పైగా సంస్థ లు మరియు 2.25 లక్షల మంది జతపడ్డారు.

ప్రముఖ సాహితీ వేత్త ఆచార్య ఎండ్లూరి సుధాకర్ మృతి

హైదరాబాద్, జనవరి 28: తెలుగు సాహిత్యంలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న, ప్రముఖ సాహితీ వేత్త ఆచార్య ఎండ్లూరి సుధాకర్ తెల్లవారుజామున హైదరాబాద్ లోని ఓ ఆస్పత్రిలో గుండెపోటుతో తుదిశ్వాస విడిచారు. సుధాకర్‌కు భార్య స్వర్గీయ డా. పుట్ల హేమలత (ప్రముఖ రచయిత్రి కవి), ఇద్దరు కుమార్తెలు మానస, మనోజ్ఞ. ఆచార్య ఎండ్లూరి సుధాకర్ జనవరి 21, 1959 న నిజామాబాద్‌లోని పాముల బస్తిలో జన్మించారు. ఈయన తెలుగు విశ్వవిద్యాలయం రాజమండ్రి సాహిత్య పీఠంలో ఇరవై ఎనిమిది సంవత్సరాలు పని చేశారు. సుమారు 100 మందికి పైగా విద్యార్థులకు గైడ్?గా వ్యవహరించారు. కేంద్ర సాహిత్య అకాడమీ జ్యూరీ సభ్యుడు, తెలుగు యూనివర్సిటీ కౌన్సిల్ సభ్యులు, తెలుగు సలహా మండలి సభ్యుడు, తెలుగు అకాడమీ సభ్యుడు, ప్రసిద్ధ హిందీ, ఉర్దూ పద్యాల, లఘు చిత్రాల అనువాదకుడుగా వ్యవహరించారు. ప్రస్తుతం హైదరాబాద్ విశ్వవిద్యాలయం తెలుగు విభాగంలో సీనియర్ ప్రొఫెసర్‌గా పని చేస్తున్నారు.

మంత్రి కేటీఆర్‌కు బాల్క సుమన్ కృతజ్ఞతలు

మంచిర్యాల జిలా, జనవరి 28; తెలంగాణ రాష్ట్ర సమితి అధ్యక్షుడిగా నియమించినందుకు బాల్క సుమన్ రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి, తెరాస వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కు కృతజ్ఞతలు తెలియజేశారు. శుక్రవారం ప్రగతి భవన్ లో మంత్రి కేటీఆర్ ను కలిసి కృతజ్ఞతలు తెలియజేయగా బాల్క సుమన్ ను మంత్రి కేటీఆర్ శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. మంచిర్యాల జిల్లాలో తెరాస పటిష్టతకు శక్తివంచన లేకుండా కృషి చేస్తానని బాల్క సుమన్ పేర్కొన్నారు.

సామాజిక బాధ్యతగా భావించి చర్యలు తీసుకుని ఉండవలసింది

హైదరాబాద్, జనవరి 28:'మద్దతు ధర ఒక మాయ' అంటూ కేంద్ర సర్కారుపై తెలంగాణ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి ట్విట్టర్‌లో మండిపడ్డారు. ''సువిశాల వ్యవసాయ భారతావనిలో కోటానుకోట్ల మందికి (అత్యధిక శాతం మందికి) జీవనోపాధిగా ఉండే వ్యవసాయరంగాన్ని దూరదృష్టితో కూడికలు, తీసివేతల లెక్కల్లో కాకుండా, ఉపాధి లభించే రంగంగా, శాశ్వతంగా ప్రజలకు ఆహార అవసరాలు తీర్చే రంగంగా ఇది ఒక సామాజిక బాధ్యతగా భావించి కేంద్రం ఇప్పటికే చర్యలు తీసుకుని ఉండవలసింది.

ప్రస్తుతం ఉన్న ఎన్డీఏ ప్రభుత్వం అటువంటి చర్యలకు ఉపక్రమిస్తుందనే ఆశ, నమ్మకం కలగడం లేదు. ఇటీవల కేంద్రం తీసుకువచ్చి, రద్దు చేసిన నల్లచట్టాల నేపథ్యంలో కేంద్రం ఉద్దేశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. వారి దృష్టిలో వ్యవసాయం లాభసాటి కాదని, దానిపై పెట్టే పెట్టుబడులు, ఇచ్చే సబ్సిడీలు నిరర్థకం అన్న భావన వారి చర్యలలో కనిపిస్తోంది" అని సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి విమర్శలు గుప్పించారు.

29 జిల్లాల్లో ఫీవర్ సర్వే పూర్తి: మంత్రి హరీశ్ రావు

ఖమ్మం. జనవరి 28: తెలంగాణ ప్రభుత్వం ప్రారంభించిన ఇంటింటికీ జ్వర సర్వేకు ప్రజల నుంచి మంచి స్పందన వస్తోందని వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి హరీశ్ రావు తెలిపారు. కోవిడ్ బారిన పడకుండా ప్రతి ఒక్కరూ తగిన జాగ్రత్తలు తీసుకునేలా వారిని చైతన్యంచేస్తున్నమని చెప్పారు. ఇప్పటి వరకూ తెలంగాణలో 29 జిల్లాల్లో జ్వర సర్వే పూర్తిచేసినట్టు మంత్రి హరీశ్ రావుస్పష్టం చేశారు. శుక్రవారం ఖమ్మం ప్రభుత్వ దవాఖానాలో క్యాథ్ లాబ్, ట్రామా కేర్ యూనిట్లను మంత్రి ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని 77లఓల ఇండ్లలో ఫీవర్ సర్వే పూర్తిచేసినట్టు తెలిపారు. అవసరమైన వారికి మెడికల్ కిట్లను అందిస్తున్నామన్నారు. ఇప్పటికే కోటి హోంఐసొలేషన్ కిట్లను సిద్ధంగా వుంచామని, మూడో వేవ్ లో 88 దవాఖానాల్లో ఆక్సీజన్ ఉత్పత్తి యూనిట్లను ఏర్పాటుచేసినట్టు మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో మంత్రి పువ్వాడఅజయ్ తదితరులు పాల్గొన్నారు.

కార్డియాక్ ఎమర్జన్సీ సేవలు, ట్రామ కేర్ విభాగాన్ని ప్రారంభించిన మంత్రి

ఖమ్మం. జనవరి 28: ఖమ్మం జిల్లా ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రిలో 7.50 కోట్ల రూపాయాలతో కార్డియాక్ ఎమర్జన్సీ సేవలు, ట్రామ కేర్ విభాగాన్ని ఆరోగ్యశాఖ మంత్రి హరిశ్ రావు ప్రారంభించారు. కార్పొరేట్ స్థాయిలో ప్రభుత్వ ఆస్పత్రిల్లో వైద్యసేవలు అందిస్తున్నామని చెప్పారు..

ఈ మేరకు మధిర, సత్తుపల్లిలో వందపడకల ఆసుపత్రులను ప్రారంభిస్తున్నట్లు మంత్రి హరీశ్ రావు చెప్పారు. కీమో థెరపీ, రేడియోథెరపీ సేవలను జిల్లా ప్రజలకు అందుబాటులోకి తెస్తామన్నారు. కరోనా నియంత్రణలో భాగంగా ప్రభుత్వం చేపట్టిన జ్వర సర్వే మంచి ఫలితం ఇచ్చిందన్నారు.

మరోమారు రెండోదశ సర్వే కూడా కొనసాగుతుందని తెలిపారు. రాష్ట్రంలో రెండు కోట్ల కరోనా టెస్టింగ్ కిట్లను అందుబాటులో ఉంచామని, అవసరమైన ప్రతిఒక్కరికి కరోనా పరీక్షలు నిర్వహిస్తామన్నారు. రాష్ట్రంలో కరోనా వ్యాక్సినేషన్ ప్రక్రియలో ఖమ్మం జిల్లా రెండవ స్థానంలో నిలిచిందని మంత్రి హరిశ్ రావు పేర్కొన్నారు. వ్యాక్సిన్ సురక్షితమైందని, తప్పకుండా ప్రతిఒక్కరూ వ్యాక్సిన్ వేసుకోవాలని సూచించారు. బూస్టర్ డోస్ అందించే సమయాన్ని 9 నెలల నుండి 3 నెలలకు వరకు తగ్గించాలని కేంద్రప్రభుత్వాన్ని కోరినట్లు మంత్రి తెలిపారు.

డ్రగ్స్ విక్రయాలపై నిఘాకు కొత్త యాప్

హైదరాబాద్, జనవరి 28:డ్రగ్స్ నియంత్రణకు 1000 మందితో ఫోర్స్ ఏర్పాటు చేయాలని సీఎం కేసీఆర్ ఆదేశించిన విషయం తెలిసిందే. అయితే ముఖ్యమంత్రి ఆదేశాలకు అనుగుణంగా డీజీపీ ఉన్నతస్థాయి సమావేశం ఏర్పాటు చేశారు. డీజీపీ మహేందర్ రెడ్డి నిర్వహించిన ఉన్నత స్థాయి సమావేశానికి జంట నగరాల పోలీస్ కమిషనర్లతో పాటు జిల్లా ఎస్పీలు హాజరయ్యారు. డ్రగ్స్ విక్రేతలు, వాడకందారులపై తీసుకోవాల్సిన చర్యలపై డీజీపీ సమావేశంలో చర్చ జరిగింది. అయితే డీజీపీ నిర్వహించిన సమావేశంలో కీలక ప్రతిపాదనలు సిద్ధం చేశారు. డ్రగ్స్ అమ్మకందారులు, వినియోగదారుల చిట్టా తయారు చేసింది పోలీసుశాఖ.. గతంలో డ్రగ్స్ తీసుకున్న వాళ్ల పేర్లతో చిట్టా సిద్ధమైంది. సినీ, రాజకీయ, వ్యాపార వేత్తలు, విద్యార్థులకు సంబంధించిన పేర్లతో చిట్టా సిద్ధమైనట్లుగా పోలీసులు ఉన్నతాధికారులు చెబుతున్నారు. డ్రగ్స్ తో పాటుగా గంజాయి తీసుకున్నవారి వివరాలను కూడా పోలీసుశాఖ పొందుపర్చింది. మరోవైపు డ్రగ్స్ విక్రయాలపై నిరంతర నిఘాకు కొత్త యాప్‌ను రూపొందించారు. ఆ యాప్ లో డ్రగ్స్ విక్రయదారుల సంబంధించిన పూర్తి సమాచారంతో అందుబాటులో ఉంచనున్నారు. ఇక, సీఎంతో పోలీసులు, ఎక్సైజ్ అధికారులతో హై లెవల్ మీటింగ్ జరగనుంది.

నాణ్యతతో పీఎంజీఎస్‌వై రోడ్లు: ఎర్రబెల్లి

హైదరాబాద్, జనవరి 28:తెలంగాణలో పీఎంజీఎస్‌వై రోడ్ల నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలలో రాజీ పడకుండా చేపడుతున్నామని కేంద్ర మంత్రి గిరిరాజ్ సింగ్‌కు మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు తెలిపారు. పనులపై కేంద్ర మంత్రి గురువారం ఢిల్లీ నుంచి అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల మంత్రులు, కార్యదర్శులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పీ ఎంజీఎనవై రోడ్ల పనులను అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారని, నిర్ణీత గడువులోపు పూర్తిచేస్తామని తెలిపారు.

డ్రగ్స్ విక్రయాలపై నిఘాకు Dopam యాప్: పోలీస్ శాఖ

హైదరాబాద్,జనవరి 28:: రాష్ట్రంలో డ్రగ్స్ విక్రయాలపై నిఘాకు డోపమ్ (Dopam) యాప్‌ను పోలీసులు రూపొందించారు. డ్రగ్స్ వ్యవహారంపై డీజీపీ మహేందర్‌రెడ్డి సమీక్ష నిర్వహించారు. డీజీపీ సమావేశంలో కీలక ప్రతిపాదనలను సిద్ధం చేశారు. డ్రగ్స్ విక్రయదారులు, వినియోగదారుల చిట్టాను రెడీ చేశారు. గతంలో డ్రగ్స్ తీసుకున్నవారి పేర్లతో చిట్టాను పోలీసులు రూపొందించారు. సినీ, రాజకీయ, వ్యాపారవేత్తలు, విద్యార్థులకు సంబంధించిన పేర్లతో చిట్టా తయారయింది. గంజాయి తీసుకున్నవారి వివరాలనూ పోలీస్‌శాఖ పొందుపర్చింది. డ్రగ్స్ విక్రయాలపై నిఘాకు Dopam యాప్‌ను పోలీసులు రూపొందించారు. డ్రగ్స్‌కు సంబంధించి గత పదేళ్ల డేటాను పోలీస్ శాఖ తయారు చేసింది.

కరోనా నియంత్రణకు ప్రతి ఒక్కరూ వాక్సిన్ తీసుకోవాలి:మంత్రి ఎర్రబెల్లి

పాలకుర్తి, జనవరి 28:: పాలకుర్తి నియోజకవర్గంలో కరోనా పరీక్షల్లో పాజిటివ్ వచ్చిన వారు అందరు ఏమాత్రం అధైర్య పడకుండా వైద్యుల సలహా మేరకు కరోనా కిట్టుల మందులను వాడినట్లయితే సంపూర్ణ ఆరోగ్యవంతులుగా కోలుకుంటారని అయన అన్నారు. శుక్రవారం సాయంత్రం హన్మకొండ నుండి పాలకుర్తి నియోజకవర్గం లోని రాయపర్తి, తొర్రుర్, పాలకుర్తి, పెద్దవంగర, కొడకండ్ల, దేవరుప్పుల మండలాలొని కరోనా బాధితులతో, అధికారులతో,ప్రజాప్రతినిధులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. కరోనా బాధితుల యోగ క్షేమాలను తెలుసుకొని కరోనా నివారణకు తగు సూచనలు చేశారు. నియోజకవర్గంలో గత మూడు రోజులుగా 1502 మందికి కోవిడ్ టేస్టులు చెయ్యగా అందులో 84 మందికి కరోనా పాజిటివ్ వచ్చిందని అయన తెలిపారు.

కరోనా సోకినా వారు ఇంటివద్దనే ఉండి కరోనా కిట్టులోని మందులను వైద్యుల, ఆరోగ్య సిబ్బంది సలహా మేరకు వాడుతూ హోం ఐసోలేషన్ లో ఉండాలని అయన సూచించారు. కరోనా కిట్టులోని మందుల వలన వ్యాధి పూర్తిగా తగ్గుతున్నదని అందువలన ధైర్యంగా ఉండి చికిత్స పొందాలని అయన కోరారు. జ్వరం తీవ్రంగా ఉండి శ్వాస పీల్చుకోవడం ఇబ్బందికరంగా ఉండటంతో పాటుగా ఆక్సిజన్ లేవల్స్ పడిపోయినట్లయితే చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రుల్లో మాత్రమే చేరాలని ఆయన కోరారు. చికిత్స కోసం సహాయ సహకారాలు అందించడానికి హన్మకొండ లో ఇద్దరు వ్యక్తిగత సిబ్బందిని, హైదరాబాద్ లో మరో ఇద్దరు వ్యక్తిగత సిబ్బందిని ఎల్లవేళలా అందుబాటులో ఉంచామని ఆయన తెలిపారు. కరోనా చికిత్స పొందుతున్నపుడు చాలా నీరసంగా ఉంటుందని అయినప్పటికీ అధైర్య పడకుండా చికిత్స తీసుకుట్లయితే క్రమ క్రమంగా కోలుకుంటారని అయన అన్నారు. ఈ సందర్భంగా చికిత్స పొందుతున్న వ్యక్తులను పేరు పేరునా పలకరించి భరోసానిచ్చారు. కరోనా బాధితులు తొందరగా కోలుకోవడానికి అందించవల్సిన వైద్య సహాయం గురించి ప్రభుత్వ డాక్టర్లకు, ఆశా వర్కర్లకు, ఏ.ఎన్.ఎం లకు ఇతర వైద్య సిబ్బందికి తగు సూచనలు చేసారు. వైద్యులు,ఆరోగ్య సిబ్బందిలలో చాలా మంది కరోనా వచ్చినను విశ్రాంతి తీసుకోకుండా కరోనా బాధితులకు చికిత్స చేయడం శ్లాఘనీయమని అయన అన్నారు. రాష్ట్రంలో కరోనా నివారణకు వ్యాక్సినేషన్ ప్రక్రియ విజయవంతంగా నిర్వహించబడుతున్నదని తెలిపారు.

బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీ ఏమైందో ప్రజలకు ఈటల సమాధానం చెప్పాలి : మంత్రి ఎర్రబెల్లి

హన్మకొండ, జనవరి 28:: తాము అధికారంలోకి వస్తే రెండుకోట్ల ఉద్యోగాలిస్తానని చెప్పి మోసం చేసిన ప్రధాని మోదీని ఏ జైల్లో పెట్టాలని బీజేపీ నాయకులను మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ప్రశ్నించారు. నగరంలో మంత్రి ఎర్రబెల్లి దయాకరరావు, ఎమ్మెల్యేలు వినయ్ భాస్కర్, ఎమ్మెల్యే ఆరూరి రమేష్ ప్రెస్ మీట్ నిర్వహించి మాట్లాడారు. వరంగల్‌లో మిర్చి రైతుల పరామర్శకు వెళ్లిన ఈటల రాజేందర్, రైతులకు ఎం నమాధానం చెబుతారని ఆయన నిలదీశారు. బయ్యారం పర్యటనకు ఈటల వ

శభాస్ కరీంనగర్ - టీకాస్త్రంలో సూపర్

(తెలంగాణలో రెండు డోసుల కరోనా టీకాను 100 శాతం పూర్తి చేసిన తొలి జిల్లాగా కరీంనగర్ నిలిచిన నేపథ్యంలో)

కరోనా వ్యాప్తి తొలి దశలో ఇండోనేషియన్లు కరీంనగర్ పట్టణానికి రావడంతో మె?దలైన కోవిడ్-19 కల్లోలంతో వణికిన నగరం వెంటనే వైరస్ వ్యాప్తిని అరికట్టే మార్గాల్లో కూడా ఇతర ప్రాంతాలకు ఆదర్శంగా నిలిచింది కరీంనగర్ సిటీ. నేడు కరీంనగర్ జిల్లాలోని అర్హులైన పౌరులందరికీ రెండు డోసుల టీకాలను విజయవంతంగా పూర్తి చేసిన తొలి తెలుగు రాష్ట్రాల జిల్లాగా, రెండవ దక్షిణభారత జిల్లాగా రికార్డు సాధించడం హర్షదాయకం, అభినందనీయం. దక్షిణాదిన రెండు డోసుల టీకాస్త్రాన్ని పూర్తి చేసిన తొలి జిల్లాగా బెంగుళూరు అర్బన్ రికార్డును నెలకొల్పిన విషయం మనకు తెలుసు. కరీంనగర్ జిల్లా ప్రభుత్వ యంత్రాంగం, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, సంబంధిత పలు శాఖలు చూపిన స్ఫూర్తివంతమైన చొరవ, కార్యదక్షతలతోనే ఈ మహత్తర కార్యక్రమం వేగంగా పూర్తి చేయబడింది. జిల్లావ్యాప్తంగా 18 ఏండ్లు దాటిన జనాభా 7,92,922 ఉండగా, జనవరి 25న 100 శాతం అర్హులు (7,93,353) రెండు డోసులు తీసుకోవడంతో కరోనా రెండు డోసుల వ్యాక్సినేషన్ పూర్తి చేసిన జిల్లాగా కరీంనగర్‌ను ప్రకటించడం జరిగింది. తెలంగాణ జిల్లాల్లో 2వ డోసులో 93 శాతంతో ఖమ్మం, 92 శాతంతో యాదాద్రి-భువనగిరి జిల్లాలు తరువాత స్థానాల్లో నిలిచాయి. తెలంగాణ రాష్ట్రంలో తొలి డోసును 100 పూర్తి చేసి 2వ డోసు పూర్తి చేయడానికి దగ్గరలో ఉన్నదని గమనించాలి.

కోవిడ్-19 వ్యాప్తి కట్టడికి ప్రధాన రక్షగా టీకాలు మాత్రమే ఉపయోగపడతాయని నమ్మిన జిల్లా యంత్రాంగ వివిధ శాఖల సమన్వయంతో ప్రత్యేక కార్యాచరణ సత్ఫలితాలను ఇచ్చిందని తెలుస్తున్నది. కరీంనగర్ జిల్లాలో తొలి డోసులు 104 శాతం, రెండవ డోసు 100.19 శాతం, 3వ డోసు ఇప్పటికే 34.47 శాతం పూర్తి చేశారు. 15 - 18 ఏండ్ల యువతకు 72.46 శాతం టీకాలు అందించారు. ఈ మహత్తర కార్యక్రమంలో కరీంనగర్ నగర కార్పొరేషన్‌లో 100 ప్రత్యేక జట్లు, కొత్తపల్లి మండలంలో 15, చొప్పదండి మండలంలో 15, జమ్మికుంటలో 30, హుజూరాబాదు మండలంలో 30 జట్లు ఏర్పాటు చేసి 2వ టీకాస్త్రాన్ని వేగంగా ప్రయోగించి విజయం సాధించారు. ఈ సఫలత వెనక జిల్లా యంత్రాంగం చూపిన చొరవలో భాగంగా అర్హత కలిగిన అందరు పౌరులను టీకాలకు మానసికంగా సిద్ధం చేయడం, ఇంటింటికి వెళ్లి టీకాలను అందించడం, జిల్లా మారుమూలలకు సహితం చేరి లక్ష్యాన్ని పూర్తి చేయడంతో 100 శాతం టీకాలను పూర్తి చేసిన జిల్లాగా ఇతర జిల్లాలకు ఆదర్శంగా నిలుస్తున్నది.

16 జనవరి 2021న ప్రారంభమైన కరోనా టీకా ఉద్యమం దేశవ్యాప్తంగా వేగంగా జరుగుతోంది. హిమాచల్ ప్రదేశ్ రాష్ట్రంలో 100 శాతం (53,86,393 అర్హులైన జనాభా) టీకాలను డిసెంబర్-2021లోనే పూర్తి చేశారు. కర్నాటక రాష్ట్రంలోని బెంగుళూరు అర్బన్ జిల్లా 100 శాతం (10.3 లక్షల అర్హులు) 2వ డోసు టీకా కార్యక్రమాన్ని పూర్తి చేసిన తొలి దక్షిణాది జిల్లాగా నిలిచిన విషయం మనకు తెలుసు. ఇదే జిల్లాలో తొలి డోసును 129 శాతం (13.2 లక్షల జనులు) పూర్తి చేసి, అదనంగా వలసదారులకు కూడా టీకాలను అందించారు. ఇప్పటి వరకు దేశంలో 164 కోట్ల డోసులను పైగా అందించడం జరిగింది, జరుగుతూనే ఉంది.

గ్రామీణ పేదలు పని ఒత్తిడిలో టీకాలకు ఆసక్తి తీసుకోకపోయినా, వారిని చేరుకొని గడప గడపకు తిరిగి టీకాలను అందించడంతో ఈ ఘనత సుసాధ్యం అయ్యిందని తెలుసుకోవాలి. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ప్రత్యేక టీమ్‌లు, వైద్య ఆరోగ్య శాఖ, జిల్లా కలెక్టరేట్, హెల్త్‌కేర్ వర్కర్లు, టీకా ఉద్యమ శృంఖలంలో పాత్రదారులందరు తమ తమ విధులను నిర్వహించిన సిబ్బంది సమిష్టి కృషితో 100 శాతం టీకాస్త్రాన్ని ప్రయోగించిన కరీంనగర్ జిల్లా ప్రయోగాన్ని దీపస్తంభంగా తీసుకొని అర్హత కలిగిన ప్రజలకు టీకాలను సకాలంలో అందించి ప్రజారోగ్య సంక్షోభంలో పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలుగు రాష్ట్రాల జిల్లాలను కోరుతున్నాం. టీకాలను తీసుకున్న జనులు అతి విశ్వాసంతో క్రమశిక్షణలను ఉల్లంఘించి ప్రవర్తించడం ప్రమాదకరమని భావించాలి. ప్రతి ఒక్కరు మాస్కులు, భౌతిక దూరాలు, సానిటైజర్లు వాడడం విధిగా పాటించాలి. దేశవ్యాప్తంగా తొలి డోసు మాత్రమే పూర్తి చేసుకున్న వేళ బెంగుళూరు, కరీంనగర్ లాంటి జిల్లాలతో పాటు హిమాచల్ ప్రదేశ్ రాష్ట్రం 2వ డోసులను 100 శాతం పూర్తి చేయడం ప్రసంశనీయం, అనుసరణీయం.

- డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి
99497 00037

ఎయిర్ ఇండియాలో వ్యూహాత్మక పెట్టుబడుల ఉపసంహరణ పూర్తి

న్యూఢిల్లీ, జనవరి 28:ఎయిర్ ఇండియాలో వ్యూహాత్మక పెట్టుబడుల ఉపసంహరణ ఈ రోజు పూర్తయింది. వ్యూహాత్మక భాగస్వామి (మెస్సర్స్ టాలేస్ ప్రైవేట్ లిమిటెడ్, మెస్సర్స్ టాటా సన్స్ ప్రైవేట్ లిమిటెడ్ పూర్తి యాజమాన్యంలోని అనుబంధ సంస్థ) నుండి రూ. 2,700 కోట్ల నిధులను ప్రభుత్వం స్వీకరించడం, రూ.15,300 కోట్ల రుణాన్ని నిలుపుకోవడంతో ఎయిర్ ఇండియా వ్యూహాత్మక పెట్టుబడుల ఉపసంహరణ లావాదేవీ ఈ రోజు పూర్తయినట్టయింది. ఎయిరిండియా, ఏఐఎక్సెల్ సంస్థలకు (100% ఎయిర్ ఇండియా షేర్లు మరియు దాని అనుబంధ సంస్థ ఏఐఎక్స్ఎల్ మరియు ఏఐఎస్ఏటీఎస్ యొక్క 50% షేర్లు) యొక్క వాటా బదిలీ చేయడం జరిగింది.

ఎయిర్ ఇండియా యొక్క వ్యూహాత్మక పెట్టుబడుల ఉపసంహరణ కోసం మెస్సర్స్ టాలేస్ ప్రైవేట్ లిమిటెడ్అత్యధిక ధర బిడ్‌కు ప్రభుత్వం ఆమోదం తెలిపిన తర్వాత, 11 అక్టోబర్ 2021న విజేత బిడ్డర్‌కు లెటర్ ఆఫ్ ఇంటెంట్ జారీ చేయబడింది. షేర్ కొనుగోలు ఒప్పందం (ఎస్‌పీఏ) 25 అక్టోబర్, 2021న సంతకం చేయడమైంది. ఆ తర్వాత, స్ట్రాటజిక్ పార్టనర్ (మెస్సర్స్ టాలేస్ ప్రైవేట్ లిమిటెడ్), ఎయిర్ ఇండియా మరియు ప్రభుత్వం ఎస్‌పీఏలో నిర్వచించబడిన షరతులను సంతృప్తి పరచడానికి పని చేశాయి, ఇందులో యాంటీ ట్రస్ట్ బాడీలు, రెగ్యులేటర్లు, రుణదాతలు, థర్డ్ పార్టీలు మొదలైన వాటికి కూడా ఆమోదాలు లభించాయి. దీంతో ఇరుపక్షాల వారిని ఇది సంతృప్తి పరిచేలా ముందుకు సాగింది.

వ్యాయామం చేస్తూ వెయిట్ లిఫ్టర్ మృతి - జాతీయస్థాయిలో సత్తా చాటిన రాజా రఘురామ్

అమరావతి, జనవరి 28:ప్రముఖ వెయిట్ లిఫ్టర్ వీరమాచినేని రాజా రఘురామ్ మరణించాడు. జిమ్ లో వ్యాయామం చేస్తూ అస్వస్థతకు గుయి అపస్మారక స్థితిలోకి వెళ్ళిపోయాడు. దాంతో అతడిని ఆసుపత్రికి తరలిస్తుండగా అప్పటికే మరణించినట్లు వైద్యులు వెల్లడించారు. కృష్ణాజిల్లా హనుమాన్ జంక్షన్ కి చెందిన రఘురామ్ హనుమాన్ జంక్షన్ లో రా జిమ్ సెంటర్ నడుపుతున్నాడు. ప్రతిరోజూ ఈ జిమ్ లోనే వ్యాయామం చేస్తుంటాడు. ఇలా నేడు వ్యాయామం చేస్తుండగా అస్వస్థతకు గురయి ప్రాణాలు కోల్పోయాడు. ప్రస్తుతం వీరమాచినేని రాజారఘురామ్ వయసు కేవలం 29ఏళ్లే. ఇంత చిన్న వయసులో అతడు చనిపోవడం క్రీడా ప్రియులనే కాదు ఏపీ ప్రజలకు బాధిస్తోంది.

ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు, శరీరాన్ని ఫిట్ గా వుంచుకునేందుకు వ్యాయామం చేయాలని చెబుతుంటారు. ఇలా చేయడం వల్ల ఎలాంటి ఆరోగ్య సమస్యలు లేకుండా ఎక్కువ కాలం జీవించవచ్చని చెబుతుంటారు. కానీ ఇదే వ్యాయామం ఇటీవల ప్రాణాలను బలితీసుకుంటోంది. శరీరం తట్టుకునే స్థాయికి మించి వ్యాయామాలు చేయడం వల్ల అనర్థాలు తలెత్తుతున్నాయని నిపుణులు చెబుతున్నారు. జాతీయస్థాయి వెయిట్ లిఫ్టింగ్ ఫోటీల్లో తెలుగువాడి సత్తాను దేశానికి తెలియజేసిన ఘనత ఇతనిదే. ఏపీ తరపున అనేక జాతీయస్థాయి ఫోటీల్లో పాల్గొన్న ఆయన పతకాలు సాధించారు. ఇలా ఏపీ పేరునే కాదు పుట్టిపెరిగిన హనుమాన్ జంక్షన్ పేరును దేశవ్యాప్తంగా ఇనుమడింపజేసారు.

ఢిల్లీలో దారుణం.. నలుగురు ఒక్కటయ్యారు.. ఇనుపరాడ్లతో కుళ్లబొడిచారు..

న్యూఢిల్లీ, జనవరి 28:ఢిల్లీ సమీపంలోని పాత ఫరీదాబాద్ పోలీస్ స్టేషన్‌లో ఓ కేసు నమోదైంది. ఓ వ్యక్తిని నలుగురు దుండగులు ఇనుప రాడ్‌లతో కాళ్లపై తీవ్రంగా కొట్టిపడేశారు. జిల్లాలోని ఖేరిపూల్ సమీపంలోని హుడా మార్కెట్‌లో గురువారం రాత్రి ఈ ఘటన జరిగింది. వ్యక్తిగత కక్షలతోనే నలుగురు గూండాలు ఆ వ్యక్తిపై ఇనుప రాడ్‌లతో దారుణంగా దాడికి పాల్పడ్డారని పోలీసులు తెలిపారు. దాడికి సంబంధించిన వీడియో క్లిప్ కూడా బయటకు వచ్చింది. బాధితుడు ఖేరిపుల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని మావాయి గ్రామానికి చెందిన తౌసిమ్ అలియాస్ వసీమ్‌గా గుర్తించారు. అతనో ట్రాక్టర్ డ్రైవర్ అని పోలీసులు తెలిపారు. కాగా, బాధితుడిని ప్రైవేట్ ఆసుపత్రిలో చేర్పించి చికిత్స అందిస్తున్నారు. దాడి చేసిన వారిలో ఒకరిని అరెస్టు చేశామని, మిగతావారిని పట్టుకోవడానికి ప్రయత్నాలు కొనసాగుతున్నాయని పోలీసులు తెలిపారు.

అరెస్టయిన నిందితుడు సాహిల్ మరో ఇద్దరు నిందితులు నిక్కీ, అర్జున్ అని పోలీసులు చెప్పారు. త్వరలోనే మిగతా వారిని అరెస్టు చేస్తాం అని ఫరీదాబాద్ పాత పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ దినేష్ కుమార్ తెలిపారు. బాధితుడికి, నిందితులకు మధ్య తలెత్తిన వ్యక్తిగత గొడవలే ఈ ఘటనకు కారణమన్నారు. అయితే తన కొడుక్కొ ఎవరితోనూ గొడవలు లేవని, ఎందుకు అంతలా హింసించారో, కాళ్లు విరిగేలా కొట్టారో తెలియదని బాధితుడి తల్లి షబ్నమ్ కన్నీరు మున్నీరు అవుతూ చెప్పారు.

గణనీయంగా పెరిగిన వేసవి పంటల విస్తీర్ణం!

న్యూఢిల్లీ, జనవరి 28:వేసవిలో వేసే పంటలు,.. రైతులకు అదనపు ఆదాయం సమకూర్చడంతోబాటుగా, రబీ, ఖరీఫ్ పంటకాలాల మధ్య ఉపాధి అవకాశాలను పెంచుతాయని, ఒక వ్యవసాయ సంవత్సరంలో వార్షిక ఉత్పాదనను కూడా అవి పెంచుతాయని కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి నరేంద్ర కుమార్ తోమర్ చెప్పారు. 2021-22వ సంవత్సరపు వేసవి పంటల సాగు జాతీయ సమ్మేళనంలో ఆయన ఈ రోజు వీడియో కాన్ఫరెన్సింగ్ ద్వారా ప్రసంగించారు. పప్పు దినుసులు, ముతక ధాన్యాలు, పోషక తృణధాన్యాలు, నూనె గింజలు వంటి వేసవి పంటల సాగును ప్రోత్సహించేందుకు ప్రభుత్వం అనేక కొత్త పథకాలను, కార్యక్రమాలను చేపట్టిందని అన్నారు. వేసవి సీజన్ సాగు విస్తీర్ణంలో సగభాగాన్ని, పప్పుదినుసులు, నూనె గింజలు, పోషకాల తృణ ధాన్యాల సాగే ఆక్రమించినప్పటికీ, రైతులు తమకు అందుబాటులో ఉన్న సేద్యపునీటి వనరులతో వరి, కూరగాయలను కూడా పండిస్తూ వస్తున్నారని కేంద్రమంత్రి అన్నారు. వేసవి సీజన్లో వరితో పాటుగా వండించే పంటల సాగు 2017-18నుంచి, ఇప్పటికి 2.7రెట్లు పెరిగిందని అన్నారు. 2017-18లో 29.71 లక్షల హెక్టార్లలో వేసవి పంటల సాగు జరగ్గా, 2020-21వ సంవత్సరంలో ఈ పంటల సాగు 80.46లక్షల హెక్టార్ల విస్తీర్ణానికి పెరిగిందని ఆయన అన్నారు.

ఇప్పటివరకూ వేసవి సీజన్లలో సాగైన పంటలను సమీక్షించి, మధింపు చేసి, ఇక ముందు వేసవి సాగుకు పంటలవారీగా లక్ష్యాలను నిర్దేశించే లక్ష్యంతో వేసవి సాగుపై ఈ సమ్మేళనాన్ని నిర్వహించినట్టు ఆయన చెప్పారు. ఆయా రాష్ట్ర ప్రభుత్వాలను సంప్రదించి, ఈ విషయంపై నిర్ణయం తీసుకోనున్నట్టు తెలిపారు. పంటల దిగుబడిని, ఉత్పాదనా సామర్థ్యాన్ని పెంచేందుకు అవసరమైన సహాయ సహకారాలను తాము అందిస్తామని, కీలకమైన వ్యవసాయ ఉపకకరణాలను, సృజనాత్మక సాంకేతిక పరిజ్ఞానం అమలు చేయడానికి తగిన సదుపాయాలను కల్పిస్తామని కేంద్రమంత్రి ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. దిగుమతులపై మనం ఆధారపడుతున్న నూనె గింజలు, పప్పుదినుసులు వంటి పంటల ఉత్పాదనను పెంచేందుకే ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తుందన్నారు.

భారతీయ వ్యవసాయ పరిశోధనా మండలి (ఐ.సి.ఎ.ఆర్.-ఇకార్) రూపొందించిన కొత్త వంగడాలను గురించి తోమర్ ప్రస్తావిస్తూ, వేసవి సీజన్లో మెరుగైన పంటల ఉత్పాదనకోసం రాష్ట్రాలు కొత్త వంగడాలను వినియోగించాలని సూచించారు. ఎరువుల ఆవశ్యతకు సంబంధించి రాష్ట్రాలు ముందస్తుగానే ప్రణాళిక వేసుకోవాలని, అందుకు సంబంధించిన అంచనాలను కేంద్ర ప్రభుత్వానికి అందించాలని, అప్పుడే కేంద్ర ఎరువుల శాఖ సకాలంలో రాష్ట్రాలకు ఎరువులను అందించేందుకు వీలుంటుందని మంత్రి చెప్పారు. రాష్ట్రాలు డి.ఎ.పి. ఎరువులపై ఆధారపడటాన్ని తగ్గించుకుని, నత్రజని, భాస్వరం, పొటాషియం (ఎన్.పి.కె.) ధాతువులతో కూడిన ఎరువులు, ద్రవరూప యూరియా వినియోగాన్ని పెంచాలని కూడా రాష్ట్రాలకు సూచించారు. చిన్న, సన్నకారు రైతులకు శిక్షణ ఇచ్చేందుకు కృషి విజ్ఞాన కేంద్రాల (కె.వి.కె.లు), వ్యవసాయ సాంకేతిక పరిజ్ఞాన నిర్వహణా సంస్థ (ఆత్మా)లు ఉమ్మడిగా చర్యలు తీసుకోవాలని, వారికి అవసరమైన శిక్షణ ఇవ్వాలని, అప్పుడే నూతన సాంకేతిక పరిజ్ఞానం, వ్యవసాయ సమాచారం అట్టడుగు ప్రాంతాలకు చేరగలదని ఆయన అన్నారు.

కోవిడ్ వైరస్ వ్యాప్తి చెందిన సంక్షోభ సమయంలో కూడా దేశంలో (4వ ముందస్తు అంచనాల ప్రకారం) 2020-21వ సంవత్సరంలో 3,085.47లక్షల టన్నుల ఆహార ధాన్యాలు ఉత్పత్తి జరిగిందని, ఇది గతంలో ఎన్నడూలేని రికార్డుగా చెప్పవచ్చని ఆయన అన్నారు. అలాగే, పప్పు దినుసుల దిగుబడి 257.19 లక్షల టన్నులు, నూనె గింజల ఉత్పత్తి 361.01లక్షల టన్నుల మేరకు జరిగిందని ఆయన చెప్పారు. ఇక పత్తి ఉత్పత్తి 353.84 లక్షల బేళ్లవరకూ జరగవచ్చన్న అంచనాలు ఉన్నాయని, దీనితో భారతదేశం ప్రపంచంలోనే మొదటి స్థానానికి చేరుకోగలదని ఆయన చెప్పారు. ఇక, ఉద్యానవన పంటల్లో కూడా సంప్రదాయక పంటలను మించి ఈ పంటల దిగుబడి నమోదైందని చెప్పారు.

కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ సహాయమంత్రి కైలాస్ చౌధరి మాట్లాడుతూ, నూనె గింజలు, పప్పు దినుసుల పంటల ఉత్పాదన పెంపుదలపై ప్రస్తుతం ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించామని, వాటి ఉత్పాదనలో స్వావలంబన సాధించేందుకు చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్రాలకు తెలిపారు. సేంద్రియ వ్యవసాయం, సహజ వ్యవసాయాన్ని గురించి ఆయన ప్రస్తావించారు. ఏదైనా ప్రాంతాన్ని, లేదా బ్లాకును సేంద్రియ, సహజ వ్యవసాయ ప్రాంతంగా నిర్దేశిస్తూ ప్రతిపాదనలను పంపించవలసిందిగా వివిధ రాష్ట్రాలకు ఆయన సూచన చేశారు. అలా చేయడం వల్ల ఆయా ప్రాంతాలకు చెందిన రైతులు వివిడిగా, వ్యక్తిగతంగా సర్టిఫికెట్లకోసం దరఖాస్తు చేసుకోవలసిన అవసరం ఉండదని కేంద్రమంత్రి అన్నారు. సేంద్రియ పంటలను సాగుచేసే రైతులకు మార్కెట్ సౌకర్యాలను కల్పించవలసిందిగా ఆయన రాష్ట్రాలకు సూచించారు.

కేంద్ర ఎరువుల శాఖ కార్యదర్శి మాట్లాడుతూ రైతులకు అవసరమైన ఎరువులు సకాలంలో అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. 2022వ సంవత్సరపు ఖరీఫ్ పంటకాలానికి అందుబాటులో ఉన్న ఎరువుల పరిమాణంపై అంచనాలను ఆయన వెల్లడించారు. 2022వ సంవత్సరం ఖరీఫ్ సీజన్లో 255.28 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా, 81.24లక్షల మెట్రిక్ టన్నుల డి.ఎ.పి., 18.50 లక్షల మెట్రిక్ టన్నుల ఎం.ఒ.పి., 76.87లక్షల మెట్రిక్ టన్నుల ఎన్.పి.కె., 34లక్షల మెట్రిక్ టన్నుల ఎస్.ఎస్.పి. అందుబాటులో ఉండే అవకాశం ఉందని తెలిపారు. కేంద్ర వ్యవసాయ పరిశోధన, విద్యా శాఖ (డి.ఎ.ఆర్.ఇ.) కార్యదర్శి,.. ఐ.సి.ఎ.ఆర్. డైరెక్టర్ జనరల్ ఈ సమావేశంలో మాట్లాడుతూ, వేసవి పంటలకు సానుకూలంగా దోహదపడే అధునాతన సాంకేతిక పరిజ్ఞాన పద్ధతులను గురించి ప్రధానంగా వివరించారు.

2021-22వ సంవత్సరం వేసవి సీజన్లో పప్పు దినుసులు, నూనె గింజలు, పోషక తృణధాన్యాల కోసం సాగుకోసం, జాతీయ స్థాయిలో, వివిధ రాష్ట్రాల వారీగా నిర్దేశించిన నిర్దేశించిన లక్ష్యాలను ఈ కార్యక్రమంలో వెల్లడించారు. 2020-21వ సంవత్సరంలో ఈ పంటలకు దేశవ్యాప్తంగా 40.85 లక్షల హెక్టార్ల విస్తీర్ణానిన్ని నిర్దేశించగా, 2021-22వ సంవత్సరంలో 52.72 లక్షల హెక్టార్ల విస్తీర్ణాన్ని నిర్ణయించారు. ఇందులో పప్పు దినుసులకు 21.05 లక్షల హెక్టార్లను, నూనె గింజలకు 13.78 లక్షల హెక్టార్లను, పోషక తృణధాన్యాల పంటలకు 17.89లక్షల హెక్టార్లను కేటాయించారు. జాతీయ ఆహార భద్రతా పథకం (ఎన్.ఎఫ్.ఎస్.ఎం.), నూనెగింజల, ఆయిల్ పామ్.లకు సంబంధించిన జాతీయ ఆహార భద్రతా పథకం కింద పప్పు దినుసుల, నూనె గింజల పంటల సాగును ప్రోత్సహిస్తారు. చెరకు సాగు, ఆయిల్ పామ్ సాగులో అంతరపంటలుగా వీటిని సాగు చేస్తారు.

కేంద్ర వ్యవసాయ మంత్రిత్వ శాఖ పరిధిలోని పంటలు, నూనె గింజల శాఖ సంయుక్త కార్యదర్శి మాట్లాడుతూ,..దేశంలో వర్షపాతం వివరాలు, ప్రాంతాలవారీగా ప్రధాన రిజర్వాయర్లలో నీటి నిల్వ తాజా స్థితి, వివిధ పంటల సాగు విస్తీర్ణం అంచనాలు, వేసవి సీజనల్లో పంటల ధోరణి, సాగు విస్తీర్ణం, వేసవి పంటలకు ప్రస్తుతం అందుబాటులో ఉన్న కార్యక్రమాలు, 2022వ సంవత్సరంలో రాష్ట్రాలవారీగా వేసవి పంటలు వేసిన విస్తీర్ణం వంటి అంశాలను వివరించారు.

'ఇండియన్ సీడ్ సర్టిఫికేషన్.కు సంబంధించిన కర దీపిక'ను ఈ సదస్సులో ఆవిష్కరించారు. రాష్ట్రాలకు సమాచారం అందించడానికి, పి.ఎం. కిసాన్ ఇ-కె.వై.సి., రైతుల సమాచారం వంటి అంశాలపై ప్రెజెంటేషన్లను కూడా ఈ సందర్భంగా సదస్సుకు సమర్పించారు.

కేంద్ర వ్యవసాయ శాఖ కార్యదర్శి సంజయ్ అగర్వాల్, వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ, ఐ.సి.ఎ.ఆర్. సీనియర్ అధికారులు, వివిధ రాష్ట్ర ప్రభుత్వాల సీనియర్ అధికారులు ఈ జాతీయ సదస్సులో వీడియో కాన్ఫరెన్సింగ్ ద్వారా పాలుపంచుకున్నారు. అన్ని రాష్ట్రాలకు సంబంధించిన వ్యవసాయ ఉత్పాదనా కమిషనర్లు, ముఖ్య కార్యదర్శులు నాలుగు గ్రూపులుగా ఏర్పడి, ప్రశ్నలు-సమాధానాల కార్యక్రమంలో పాల్గొన్నారు. వేసవి కాలంలో సాగు చేయాల్సిన పంటలను, విస్తీర్ణాన్ని, పంటల ఉత్పాదనను పెంచడంలో ఇప్పటి వరకూ సాధించి విజయాలు, ఇకముందు అనుసరించవలసిన వ్యూహాలు, ఎదురయ్యే సవాళ్లు తదితర అంశాలపై వారు తమతమ అనుభవాలను కూడా పరస్పరం పంచుకున్నారు.

భారతీయ నావికాదళానికి కృత్రిమ మేధస్సు (ఎఐ) ఉపయోగించడంపై ఐఎన్ఎస్ వల్సురాలో వర్క్‌షాప్



న్యూఢిల్లీ, జనవరి 28:భారత నావికాదళ ప్రముఖ సాంకేతిక శిక్షణా సంస్థ ఐఎన్ఎస్ వల్సూరా 19 జనవరి నుంచి 21, 2022న సమకాలీన అంశమైన భారతీయ నావికాదళం కోసం కృత్రిమ మేధస్సును (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్)ను ఉపయోగించుకోవడం అన్న అంశంపై వర్క్‌షాప్‌ను నిర్వహించింది.

దక్షిణా నావికాదళ కమాండ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి గూగుల్, ఐబిఎం, ఇన్ఫోసిస్, టిసిఎస్ నుంచి వచ్చిన వక్తలు ఈ మూడు రోజుల కార్యక్రమంలో పరిశ్రమ దృష్టికోణాన్ని పంచుకున్నారు. ఐఐటి ఢిల్లీ, న్యూయార్క్ యూనివర్సిటీ, అమృతా యూనివర్సిటీ, డిఎ-ఐఐసిటి నుంచి వచ్చిన ప్రముఖ విద్యావేత్తలు ఎఐ నూతన సరళులు, అప్లికేషన్ల గురించి మాట్లాడారు. ఈ సందర్భంగా ముఖ్యోపన్యాసం చేస్తూ, ఈ సముచిత సాంకేతిక, భారతీయ నావికాదళానికి అనువర్తనం చేయాల్సిన వ్యూహాత్మక ప్రాముఖ్యతను వైస్ అడ్మిరల్, దక్షిణ నావికాదళ కమాండ్ ఫ్లాగ్ ఆఫీసర్ కమాండింగ్ ఇన్ చీఫ్ ఎంఎ హంపిహోలి నొక్కి చెప్పారు. ఆన్‌లైన్‌లో నిర్వహించిన ఈ వెబినార్‌లో దేశం నలుమూలల నుంచి దాదాపు 500మందికిపైగా పాల్గొన్నారు.

కీలక మిషన్ ప్రాంతాలలో కృత్రిమ మేధస్సు (ఎఐ)ను, మెషీన్ లెర్నింగ్‌ను కలుపుకోవడంపై భారతీయ నావికాదళం దృష్టి పెడుతోంది. జామ్‌నగర్‌లో ఉన్న ఐఎన్ఎస్ వల్సురా ఇప్పటికే బిగ్ డేటా రంగంలో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ (సిఒఇ)గా గుర్తింపు పొందడమే కాదు, ఎఐ, బిగ్ డాటా విశ్లేషణ (బిడిఎ) కోసం అత్యధునాతన ప్రయోగశాలను జనవరి 2020న ఏర్పాటు చేయడం జరిగింది. విద్యావేత్తలు, పరిశ్రమల సహకారంతో హెచ్ఆర్ అండ్ పర్సెప్షన్ అసెస్‌మెంట్, నిర్వహణ పరిధుల్లో, ఎఐ- బిడిఎను అందిపుచ్చుకోవడానికి సంబంధించి పైలెట్ ప్రాజెక్టుల పురోగతికి సాధనంగా ఉన్న ఐఎన్ఎస్ వల్సురాలో ఎఐ రంగంలో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ (సిఒఇ)ను సృష్టించే ప్రక్రియలో నావికాదళం ఉంది. ఇందుకు అదనంగా, ఎఐ ఇంజిన్లకు డేటా అన్నది ఇంధనం కనుక, తన ఎంటర్‌ప్రైజ్ డాటాను ఏకీకరించడం, పునర్వ్యవస్థీకరించడంలో నావికాదళం లోతుగా నిమగ్నమై ఉంది.

సంస్థాపరంగా, నావికాదళం ఎఐ మూల బృందాలను ఏర్పాటు చేసింది. ఇవి ఎఐ/ ఎంఎల్ చొరవలను అంచనా వేసేందుకు ఏడాదిలో రెండుసార్ల సమావేశం అవుతాయి. నావికాదళం నిర్వహిస్తున్న ఎఐ కార్యక్రమాలు వ్యూహాత్మక, యుద్ధ కుశలత స్థాయి ప్రభావాన్ని రెండింటినీ కలిగి ఉంటాయి. ప్రకటించిన సమయానికి కట్టుబడి ఉండడాన్ని చూసేందుకు ఎఐ ప్రాజెక్టులను ఎప్పటికప్పుడు సమీక్షలు చేస్తున్నారు. తన అధికారులు, నావికులకు అన్ని స్థాయిల ప్రత్యేకతలలో ఎఐ/ ఎంఎల్ శిక్షణను కూడా నావికాదళం నిర్వహిస్తోంది. ఈ శిక్షణను నావికాదళ స్వంత శిక్షణా కళాశాలల్లోనే కాక ప్రముఖ ఐఐటిలలో కూడా నిర్వహిస్తున్నారు. గత మూడు ఏళ్ళల్లో అనేకమంది ఉద్యోగులు ఎఐకి సంబంధించిన పెద్ద, చిన్న కోర్సులలో శిక్షణ పొందారు.

భారతీయ నావికాదళం చేపట్టిన ఈ చొరవలు, ఎఐలో భారతదేశాన్ని అంతర్జాతీయ స్థాయి నాయకుడిగా మార్చడం, అందరికీ బాధ్యతాయుతమైన, పరివర్తనాత్మక ఎఐ అందేలా హామీ ఇవ్వడం అన్న దేశ దార్శనికతకు అనుగుణంగా ఉన్నాయి.

పెద్ద ప్రమాదం నుండి తప్పించుకున్న వ్యక్తి

న్యూఢిల్లీ, జనవరి 28: అదృష్టం అంటే ఇతనిదే..కనురెప్ప మూసి, తెరిచేంతలో పెద్ద ప్రమాదం నుండి బయటపడ్డాడు. మలేషియాలో జోరుగా వర్షం పడుతోంది..దాంతో రోడ్లపై వెళ్ళే వాహనాలు జారడం మామూలే. అయితే ఓ వ్యక్తి బైక్ పై వెళ్తుండగా జారి పడ్డాడు. వేన వస్తోన్న ఓ ట్రక్ అతని వైపు దూసుకువచ్చింది. ఆ వ్యక్తి పడిపోయినా కూడా.. అతని బుర్ర వేగంగా పనిచేస్తోంది. వెంటనే ఒక్క ఉదుటున లేచి పక్కకి పరిగెత్తాడు. అతను లేవడం ఒక్క సెకను ఆలస్యమైనా అతని ప్రాణాలు గాల్లో కలిసిపోయేవి. ఈ వీడియో చూసిన వారికి కూడా టెన్షన్ రావడం ఖాయం. కావాలంటే.. మీరు కూడా ఈ వీడియోని మీరు చూడండి .ఖీ చినీతీశ్రీట జినీలి అనే యూట్యూబ్ పేజీలో ఈ వీడియోని మొదట పోస్టు చేశారు. ఈ సంఘటన మలేషియాలో చోటుచేసుకోగా.. ఈ ఘటనకు సంబంధించిన వీడియో నెట్టింట వైరల్ గా మారింది.

కోవిడ్-19 నియంత్రణకు భారతదేశం అమలు చేస్తున్న సమర్ధ చురుకైన చర్యలకు నిదర్శనంగా అనుమతుల మంజూరు

న్యూఢిల్లీ, జనవరి 28:దేశంలో ఉత్పత్తి అవుతున్న కోవిడ్-19 టీకాలను మార్కెట్లో విక్రయించడానికి షరతులు, నిబంధనలతో కూడిన అనుమతులను జాతీయ ఔషధ నియంత్రణ సంస్థ (డీసీజీఐ) ఈ రోజు మంజూరు చేసింది. కేంద్ర ఔషధ ప్రమాణాల నియంత్రణ సంస్థ (సీడీఎస్ సిఓ)కి చెందిన నిపుణుల కమిటి సిఫార్సుల మేరకు డీసీజీఐ ఈ నిర్ణయం తీసుకుంది. టీకాలను అత్యవసర పరిస్థితుల్లో వినియోగించేందుకు ఇచ్చిన అనుమతులను సవరించి పెద్దలు వినియోగించేందుకు వీల

శ్రీనివాస సేతును త్వరలో ప్రారంభించనున్న సీఎం జగన్

తిరుపతి, జనవరి 28:శ్రీవారి భక్తులకు మరో రహదారి అందుబాటులోకి రానుంది. శ్రీనివాసం సర్కిల్ నుంచి నంది సర్కిల్ వరకు నిర్మాణం దాదాపుగా పూర్తి అయిన శ్రీనివాస సేతు(గరుడ వారధి)ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి చేత త్వరలోనే ప్రారంభింపచేస్తామని టీటీడీ చైర్మన్ వైవి సుబ్బారెడ్డి చెప్పారు. శుక్రవారం ఆయన నంది సర్కిల్ సమీపం నుంచి శ్రీనివాసం సర్కిల్ వరకు వారధి మీద ప్రయాణించారు. తుది దశలో ఉన్న పనులను పరిశీలించి ఆఫ్కాన్ సంస్థ అధికారులతో మాట్లాడారు. వారధి మీద ఏర్పాటు చేసిన ఫైబర్ సిగ్నల్స్ ను చూశారు.

అనంతరం ఆయన మాట్లాడుతూ, తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకర రెడ్డి వారధి నిర్మాణం పనులు త్వరగా పూర్తి చేయించాలని పలు మార్లు ముఖ్యమంత్రిని కోరారన్నారు. ముఖ్యమంత్రి ఆదేశం మేరకు నిర్మాణం పనులు వేగవంతం చేసి తొలివిడతగా శ్రీనివాసం నుంచి నంది సర్కిల్ వరకు వారధి ప్రారంభానికి ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. ఈ వారధి ప్రారంభమైతే అటు భక్తులు, ఇటు తిరుపతి స్థానికులకు కూడా ట్రాఫిక్ ఇబ్బందులు తొలగిపోతాయని సుబ్బారెడ్డి తెలిపారు.

కొత్త పీఆర్సీ ప్రకారమే జనవరి నెల వేతనాలు : సజ్జల రామకృష్ణారెడ్డి

అమరావతి, జనవరి 28:ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పీఆర్సీ రగడ ఇప్పట్లో సమసిపోయేలా లేదు. ఒక వైపు ప్రభుత్వం ఉద్యోగులను చర్చలకు ఆహ్వానిస్తోంది.. అయితే ఉద్యోగులు మాత్రం చర్చలకు వచ్చే ప్రసక్తే లేదని అంటున్నారు. అయితే తాజాగా? పీఆర్సీ వ్యవహారం, ఉద్యోగుల ఆందోళనల పై ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. కొత్త పీఆర్సీ ప్రకారమే ఉద్యోగులకు జనవరి నెల వేతనాలు చెల్లిస్తాం అన్నారాయన. ఉద్యోగులు చేస్తున్న ఆందోళనలకు, ఉద్యోగ సంఘ నాయకులు పెట్టిన మూడు డిమాండ్లకు సంబంధం లేదన్నారు.

ముఖ్యమైన హెచ్ఆర్ఏ సవరణ అంశాన్ని ఉద్యోగ సంఘాలు ప్రస్తావించటం లేదని, ఉద్యోగ సంఘాలు మంత్రుల కమిటీతో చర్చలకు వస్తే పాత జీతాలు వేసే అంశాన్ని కూడా ప్రభుత్వం పరిశీలించి ఉండేదన్నారు. కొత్త పేస్కేళ్లతో వేతన బిల్లులను రూపొందిస్తున్న డీడీఓలను పని చేసుకోనివ్వకుండా అడ్డుకుంటున్నారన్నారు. హెచ్ఆర్ఏ శ్లాబుల పై నష్టం జరుగుతుందని ఉద్యోగ సంఘాలు భావిస్తే దానిపై చర్చించడానికి మంత్రుల కమిటీ సిద్ధంగా ఉందని, ఉద్యోగ సంఘాల కంటే ఎక్కువే ఉద్యోగుల బాగోగుల గురించి ప్రభుత్వం ఆలోచించిందని సజ్జల పేర్కొన్నారు.

న్యాయవాది విద్యాసాగర్ రెడ్డికి నివాళులర్పించిన మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి

నిర్మల్, జనవరి 28:: హై కోర్టు సీనియర్ న్యాయవాది నిరంజన్ రెడ్డి తండ్రి విద్యాసాగర్ రెడ్డి (న్యాయవాది) పార్థివదేహానికి న్యాయ శాఖ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి నివాళులర్పించారు. ప్రియదర్శిని నగర్ – సాగర్ కాలనీలోని ఆయన నివాసంలో విద్యాసాగర్ రెడ్డి పార్థివదేహం వద్ద పుష్పగుచ్ఛం ఉంచి శ్రద్ధాంజలి ఘటించారు. విద్యాసాగర్ రెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించి, తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. వారికి భగవంతుడు మనోధైర్యం ఇవ్వాలని ప్రార్థించారు.

ఉద్యోగులు ముందుకు వస్తేనే చర్చలు : మంత్రి బొత్స

అమరావతి, జనవరి 28:పీఆర్సీ అంశం పరిష్కారం కోసం ప్రభుత్వమే చొరవ తీసుకుని చర్చలకు పిలుస్తుంటే ఉద్యోగులకు అలుసుగా మారిందని ఏపీ పురపాలక శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ అసహనం వ్యక్తం చేశారు. ఉద్యోగుల డిమాండ్లపై చర్చించేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన కమిటీలో బొత్స కూడా ఉన్నారు. చర్చలకు ఉద్యోగులు రాకపోవడం పట్ల ఆయన స్పందిస్తూ, ఏ అంశమైనా చర్చలతోనే పరిష్కారం అవుతుందన్న విషయాన్ని ఉద్యోగులు గుర్తించాలని అన్నారు. మొండిపట్టుదలకు పోతే ఎవరికి నష్టం? అని ప్రశ్నించారు. చర్చలకు రాకుండా ఇంట్లోనే కూర్చుంటామంటే చట్టం తన పని తాను చేసుకుపోతుందని స్పష్టం చేశారు.

ఉద్యోగులు ఇకనైనా అపోహలు వీడాలని, జీతం ఒక్క రూపాయి కూడా తగ్గదని స్పష్టం చేశారు. జీతం పెరుగుతుందో, తగ్గుతుందో పే స్లిప్ చూసుకోవాలని హితవు పలికారు. ఉద్యోగులు ప్రభుత్వంలో భాగమేనని, ఉద్యోగుల సమస్య ప్రభుత్వ సమస్యే అవుతుందని బొత్స పేర్కొన్నారు. ఉద్యోగులు ఎప్పుడు వచ్చినా చర్చలకు తాము సిద్ధమేనని ప్రకటించారు. అయితే ఇకమీదట రోజూ సచివాలయానికి వచ్చి ఉద్యోగుల కోసం ఎదురుచూస్తూ కూర్చోబోమని, చర్చలకు సిద్ధమని ఉద్యోగులు ప్రకటిస్తేనే తాము వస్తామని తేల్చి చెప్పారు. ఇవాళ కొందరు ఉద్యోగ సంఘ నేతలు వచ్చి తమను కలిశారని బొత్స వెల్లడించారు.

కర్ణాటకకు చెందిన గ్రాస్‌రూట్ ఇన్నోవేటర్ 2022 సంవత్సరానికి పద్మశ్రీకి ఎంపికయ్యారు

న్యూఢిల్లీ, జనవరి 28:కర్నాటకలోని ధార్వాడ్‌కు చెందిన శ్రీ అబ్దుల్ ఖాదర్ నడకట్టిన్ అనే సీరియల్ గ్రాస్‌రూట్ ఇన్నోవేటర్ (గ్రాస్‌రూట్ ఇన్నోవేషన్) విభాగంలో 2022 సంవత్సరానికి ప్రకటించిన 107 మంది పద్మశ్రీ అవార్డు గ్రహీతలలో ఒకరు.

శ్రీ అబ్దుల్ ఖాదర్ నడకత్తిన్ ఓ సీరియల్ ఇన్నోవేటర్. అతని ప్రముఖ ఆవిష్కరణలలో చింతపండు గింజలను వేరుచేసే పరికరం, దున్నే బ్లేడ్ తయారీ యంత్రం, విత్తనాలు మరియు ఎరువుల డ్రిల్, వాటర్ హీటింగ్ బాయిలర్, ఆటోమేటిక్‌గా చెరకు నాటే డ్రిల్లర్ మరియు వీల్ టిల్లర్ ఉన్నాయి. అతని ఆవిష్కరణలన్నీ సుస్థిరత, వ్యయ-సమర్థత, పర్యావరణ అనుకూలత మరియు ముఖ్యంగా సామాజిక ఆమోదం సూత్రాలను ప్రదర్శిస్తాయి. వ్యవసాయ-వాతావరణ పరిస్థితులు మరియు నేల లక్షణాలపై అతనికి ఉన్న లోతైన జ్ఞానం దేశంలోని ఇతర రైతులకు అతనిని స్ఫూర్తిగా మార్చింది.

ఇతని మొదటి ఆవిష్కరణ "ం చిజీ(ష్ట్ర)బివతీ అలారం," ఇది ఉదయం వరకు నిద్రపోయే తన స్వంత స్వభావాన్ని పరిష్కరించడానికి అతను చేసిన ప్రయత్నం. అతను అలారం కీ చివరన ఒక సన్నని తాడును కట్టారు. ఆ విధంగా కీ విప్పినప్పుడు, కీకి కట్టిన తీగకు తగులుతుంది. స్ట్రింగ్ క్రమంగా నీటితో నిండిన బాటిల్‌కు కట్టివేయబడుతుంది. కీ పూర్తిగా విప్పబడినప్పుడు బాటిల్ వంగిపోతుంది దాంతో అందులోని నీరు అతని ముఖం మీద పడుతుంది. అదేవిధంగా ఆయన ఆధునిక వ్యవసాయంతో ఔచిత్యాన్ని కొనసాగిస్తూనే స్థానిక ప్రజలకు వివిధ అవసరాలను తీర్చే వ్యవసాయ-సాంకేతికతలను మరియు పనిముట్లను అభివృద్ధి చేశారు.

నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ (ఎన్ఐఎఫ్) ఇండియా మద్దతుతో భారత ప్రభుత్వ స్వయం ప్రతిపత్తి సంస్థ అయిన సైన్స్ అండ్ టెక్నాలజీ (డీఎస్టీ) సంస్థ శ్రీ అబ్దుల్ ఖాదర్ నడకత్తిన్‌కు ఎన్ఐఎఫ్ 8వ జాతీయ గ్రాస్‌రూట్ ఇన్నోవేషన్ మరియు అత్యుత్తమ సాంప్రదాయం సందర్భంగా 2015లో జీవితకాల సాఫల్య పురస్కారం లభించింది. అప్పటి గౌరవనీయులైన భారత రాష్ట్రపతి శ్రీ ప్రణబ్ ముఖర్జీచే నాలెడ్జ్ అవార్డులు పొందారు. ఆ సందర్భంగా ఆయన అవార్డుకు గౌరవ సూచకంగా చెప్పులు లేకుండా నడవాలని నిర్ణయించుకున్నారు. అందుకే ఆయన "బేర్‌ఫుట్ సైంటిస్ట్"గా పేరు పొందారు.

చింతపండుకు సంబంధించిన అతని ఆవిష్కరణల కారణంగా, ప్రజలు అతన్ని "హునాసే హుచ్చా" అని పిలవడం ప్రారంభించారు. అంటే చింతపండు ఉన్మాది. నీటి కొరత కారణంగా చింతపండును ఆల్కలీన్ నీటితో పండించడంలో అతను విజయం సాధించారు. అలాగే చెట్టు నుండి చింతపండును పండించే సాంకేతికత మరియు చింతపండు గింజలను వేరు చేయడానికి అత్యంత ఆమోదించబడిన యంత్రం వంటి ప్రయోగాలతో మరింత ఖ్యాతి చెందారు. చింతపిక్కలను వేరు చేసే యంత్రాన్ని అభివృద్ధి చేయడానికి ఇది అతనికి ప్రేరణనిచ్చింది. చింతపండుతో విజయాన్ని సాధించిన అనంతరం ఆయన లోతుగా దున్నడం, విత్తనాలు విత్తడం మరియు ఇంధన సమర్థవంతమైన నీటిని వేడి చేసే బాయిలర్ వంటి వ్యవసాయ కార్యకలాపాలకు ఉపయోగపడే కొత్త ఆవిష్కరణలతో ముందుకు వచ్చారు.

సాహిత్యం మరియు విద్య, కళలు, సైన్స్, ఇంజినీరింగ్, వాణిజ్యం, పౌర సేవలు, ప్రజా వ్యవహారాలు, క్రీడలు మరియు వైద్యం వంటి వివిధ విభాగాలలో అందించబడే భారతదేశ అత్యున్నత పౌర పురస్కారాలలో ఒకటైన పద్మ అవార్డులు గత కొన్ని సంవత్సరాలుగా అట్టడుగు స్థాయిలోఉన్న ఆవిష్కర్తలకు గుర్తింపును ఇస్తున్నాయి. తద్వారా ప్రస్తుత తరాన్ని మరింతగా ఆవిష్కరింపజేయడానికి స్ఫూర్తినిస్తుంది!

ఎన్ఐఎఫ్ 8వ జాతీయ గ్రాస్‌రూట్స్ ఇన్నోవేషన్ మరియు అత్యుత్తమ సాంప్రదాయ నాలెడ్జ్ అవార్డుల సందర్భంగా శ్రీ అబ్దుల్ ఖాదర్ నడకట్టిన్ అప్పటి గౌరవనీయులైన రాష్ట్రపతి శ్రీ ప్రణబ్ ముఖర్జీ చేతుల మీదుగా లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డును అందుకున్నారు.

తొలిసారిగా ప్రజలను మంత్రముగ్ధులను చేయనున్న భారతదేశంలో తయారైన డ్రోన్లు

న్యూఢిల్లీ, జనవరి 28:ఈ ఏడాది ' బీటింగ్ ది రిట్రీట్ ' వేడుక లో డ్రోన్లు ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయి. 2022 జనవరి 29 వ తేదీన ఢిల్లీలోని చారిత్రాత్మక విజయ్ చౌక్‌లో జరిగే ఈ వేడుకకు రాష్ట్రపతి, సాయుధ దళాల సుప్రీం కమాండర్ శ్రీ రామ్ నాథ్ కోవింద్ హాజరవుతారు. 75 సంవత్సరాల స్వాతంత్ర్యాన్ని పురస్కరించుకుని నిర్వహిస్తున్న 'ఆజాదీ కా అమృత్ మహోత్సవ్' వేడుకల్లో భాగంగా ఈ ఏడాది ' బీటింగ్ ది రిట్రీట్ ' కార్యక్రమాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు సాగుతున్నాయి. ' బీటింగ్ ది రిట్రీట్ ' కార్యక్రమానికి రాష్ట్రపతితో సహా ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ, రక్షణ శాఖ మంత్రి శ్రీ శ్రీ రాజ్‌నాథ్ సింగ్‌తో ఇతర ప్రముఖులు హాజరవుతారు. ' మేక్ ఇన్ ఇండియా' స్ఫూర్తిని ప్రతిబింబేలా 2022 ' బీటింగ్ ది రిట్రీట్ ' వేడుకకు రూపకల్పన చేసి రూపొందించారు.

ఈ ఏడాది ' బీటింగ్ ది రిట్రీట్ ' లో భారతీయ నేపథ్యంలో రూపొందించిన యుద్ధ సంగీత స్వరాలు వీనులకు విందు చేయనున్నాయి. సైన్యం, నావికా దళం, వాయుసేన, కేంద్ర సాయుధ దళంకు చెందిన సంగీత బృందాలు 26 ప్రదర్శనలు ఇస్తాయి. ఇవన్నీ ప్రజలను విశేషంగా అలరిస్తాయి. ' వీర్ సైనిక్' స్వరంతో అన్ని బృందాలు కలిసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తాయి. దీని తర్వాత పైప్స్ , డ్రమ్స్ బ్యాండ్, సీఏపీఎఫ్ బ్యాండ్, ఎయిర్ ఫోర్స్ బ్యాండ్, నావల్ బ్యాండ్, ఆర్మీ మిలిటరీ బ్యాండ్ మరియు మాస్ బ్యాండ్‌లు ఉంటాయి. వేడుకకు ప్రధాన కండక్టర్ గా కమాండర్ విజయ్ చార్లెస్ డి'క్రూజ్ వ్యవహరిస్తారు.

'ఆజాదీ కా అమృత్ మహోత్సవ్' వేడుకలో భాగంగా 2022 ' బీటింగ్ ది రిట్రీట్ ' అనేక కొత్త స్వరాలు జోడించబడ్డాయి. వీటిలో ' కేరళ ', ' హింద్ కి సేన ' మరియు ' ఏ మేరే వతన్‌కే లోగాన్ ' ఉన్నాయి. జనాదరణ పొందిన ' సారే జహాన్ సే అచ్ఛా 'ఆలాపనతో కార్యక్రమం ముగుస్తుంది. డ్రోన్ ప్రదర్శనను ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటీ) ఢిల్లీ మరియు శాస్త్ర సాంకేతిక శాఖ సహకారంతో అంకుర సంస్థ 'బాట్‌లాబ్ డైనమిక్స్' నిర్వహిస్తుంది. స్వదేశీ సాంకేతికతతో తయారైన సుమారు 1,000 డ్రోన్లతో ఈ ప్రదర్శన నిర్వహిస్తారు. ప్రదర్శన 10 నిమిషాల సేపు జరుగుతుంది. డ్రోన్ షో సమయంలో సమకాలీకరించబడిన నేపథ్య సంగీతం కూడా వినిపిస్తుంది.

75 సంవత్సరాల స్వాతంత్ర్యానికి గుర్తు గా నిర్వహించే ప్రదర్శన మరొక ఆకర్షణగా ఉంటుంది. వేడుక ముగిసే ముందు నార్త్ మరియు సౌత్ బ్లాక్ గోడలపై దాదాపు 3-4 నిమిషాల నిడివి గల ఈ ప్రదర్శన ప్రదర్శించబడుతుంది.

గణతంత్ర దినోత్సవం సందర్భంగా రూపొందించిన విధంగా కోవిడ్-19 నిబంధనలకు అనుగుణంగా 'బీటింగ్ ది రిట్రీట్' వేడుక కోసం పర్యావరణహిత ఆహ్వాన పత్రాలను సిద్ధం చేశారు. అశ్వగంధ, కలబంద, ఉసిరి మొక్కల విత్తనాలను ఆహ్వాన పత్రాల్లో పొందుపరిచారు. ప్రజలు తమ తోటలు/పూల కుండీలలో నాటడం తో పాటు పాతకాలపు ఔషధ ప్రయోజనాలు పొందేలా చూసేందుకు వీటిని రూపొందించారు.

'బీటింగ్ ది రిట్రీట్' అనేది శతాబ్దాల నాటి సైనిక సంప్రదాయం. సూర్యుడు అస్తమించిన వెంటనే యుద్ధానికి విరామం ఇవ్వడం ఆనవాయితీగా ఉంది. బగల్ శబ్దం వినిపించిన వెంటనే దళాలు పోరాటాన్ని నిలిపివేసి, తమ ఆయుధాలకు విశ్రాంతి ఇచ్చి యుద్ధభూమి నుండి ఉపసంహరించుకుంటాయి . ఈ కారణంగానే తిరోగమనం సమయంలో ఎక్కడి వారు అక్కడ నిలిచి ఉండే ఆచారం ఈనాటికీ కొనసాగుతోంది. ఉపసంహరణ సమయంలో రంగులు మరియు ప్రమాణాలను భద్రపరిచి జెండాలు అవనతం చేయబడతాయి.

పట్టణాలు మరియు నగరాల్లో విధులు నిర్వహించే దళాలను సాయంత్రం నిర్ణీత సమయంలో వారి క్వార్టర్‌లకు తిరిగి రావాలని పిలుస్తూ డప్పులను వాయించడం జరుగుతుంది. ఈ సైనిక సంప్రదాయాల ఆధారంగా నిర్వహించే 'బీటింగ్ ది రిట్రీట్' వేడుక గత కాల స్మృతులను గుర్తు చేస్తుంది.

చారిత్రక కట్టడాల పరిరక్షణ కోసం తెలంగాణ ప్రభుత్వం విశేష కృషి

హైదరాబాద్, జనవరి 28:చారిత్రక కట్టడాల పరిరక్షణకోసం తెలంగాణ ప్రభుత్వం విశేష కృషి చేస్తున్నదని, చరిత్రలో నిలిచిపోయే విధంగా కట్టడాలను మరింత సుందరంగా తీర్చిదిద్దుతామని రాష్ట్ర పశుసంవర్ధక, మత్స్య, పాడి పరిశ్రమల అభివృద్ధి, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ వెల్లడించారు. సనత్‌నగర్ నియోజకవర్గం పరిధిలోని బన్సీలాల్‌పేటలో నిజాం ప్రభుత్వ హయాంలో నిర్మించిన మెట్ల బావిని మున్సిపల్ పరిపాలన శాఖ స్పెషల్ చీఫ్ సెక్రెటరీ అరవింద్ కుమార్, సహిత స్వచ్ఛంద సంస్థ

నిర్వాహకురాలు కల్పనా రమేష్‌తో కలిసి పరిశీలించారు. ఎంతో పురాతనమైన మెట్ల బావి కోనేరు 30.5 మీటర్ల పొడవు, 19.2 ఫీట్ల వెడల్పు, 53 అడుగుల లోతు కలిగి ఉంది. ఈ బావి పూర్తిగా చెత్త, వ్యర్థాలతో పూడిపోగా 6 నెలల పాటు-శ్రమించి సహిత స్వచ్ఛంద సంస్థ జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో 2వేల మెట్రిక్ టన్నుల చెత్తను తొలగించడం జరిగింది. ఈ బావికి పూర్వవైభవం తీసుకొచ్చేందుకు తీసుకోవాల్సిన

చర్యలను తెలుసుకునేందుకు బావిని పూర్తిస్థాయిలో మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్, మున్సిపల్

పరిపాలన శాఖ స్పెషల్ చీఫ్ సెక్రెటరీ అరవింద్ కుమార్‌లు తిరిగి పరిశీలించారు. బావిలోని చెత్త తొలగింపునకు ముందున్న పరిస్థితి, ప్రస్తుత పరిస్థితులను వివరించేలా ఏర్పాటు చేసిన ఫొటో ప్రదర్శనను తిలకించారు.

ఈ సందర్భంగా మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ హైదరాబాద్‌కు చారిత్రక నగరంగా ప్రత్యేక గుర్తింపు ఉన్నదని, అనేక పురాతన కట్టడాలు ఈ నగరంలో ఉన్నాయని వివరించారు. చరిత్రకు సాక్ష్యాలుగా నిలిచే పురాతన కట్టడాలను పరిరక్షించి వాటికి పూర్వవైభవం తీసుకురావాలని ముఖ్యమంత్రి

కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు ఆదేశించారని తెలిపారు. 17వ దశాబ్దంలో ఈ ప్రాంత ప్రజల అవసరాల కోసం బన్సీలాల్‌పేటలో ఈ మెట్ల బావిని నిర్మించినట్లు తెలిపారు. ఈ బావిని ఆగస్టు 15వ తేదీ నాటికి పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసి పర్యాటకులను ఆకర్షించే విధంగా తీర్చిదిద్దే విధంగా చర్యలు తీసుకోవడం

జరుగుతుందని మంత్రి శ్రీనివాస్ యాదవ్ వివరించారు. ఈ బావికి సంబంధించిన చరిత్ర ఇక్కడికి వచ్చే ప్రజలకు తెలిసేలా పూర్తి సమాచారాన్ని ఇక్కడ ఏర్పాటు చేసేలా చర్యలు చేపడతామన్నారు.

స్పెషల్ చీఫ్ సెక్రెటరీ అరవింద్‌కుమార్ మాట్లాడుతూ నగరంలో ఉన్న పురాతన కట్టడాలను గుర్తించి వాటి పునరుద్ధరణ, పరిరక్షణకోసం అవసరమైన చర్యలు తీసుకోవాలని మున్సిపల్ శాఖ మంత్రి

కల్వకుంట్ల తారకరామారావు ఆదేశించారని తెలిపారు. అందులో భాగంగా ఇప్పటికే



మోజం జాహి మార్కెట్‌ను అభివృద్ధి చేయడం జరిగిందని, త్వరలోనే మోండా మార్కెట్, మిరాలంమండి, సర్దార్‌మహల్ తదితర పురాతన నిర్మాణాలను పునరుద్ధరించనున్నట్లు తెలిపారు. నగరంలో ఇలాంటి బావులు 44వరకు ఉండగా, ఇప్పటికే బన్సీలాల్‌పేటతో సహా ఆరుబావుల పునరుద్ధరణ పనులు చేపట్టడం జరిగిందని, వీటిలో బాపూఘాట్, గచ్చిబౌలి, సీతారాంబాగ్, గుడిమల్కాపూర్, శివంబాగ్‌లు ఉన్నాయని చెప్పారు. మరో 20 బావుల పునరుద్ధరణ పనులను త్వరలోనే చేపట్టనున్నట్లు వివరించారు.

రూ.2.5 కోట్లతో జిల్లా నూతన గ్రంధాలయనికి శ్రీకారం...!

మెదక్, జనవరి 28 (నేటి నిజం ప్రతినిధి) మెదక్ పట్టణంలో రెండున్నర కోట్ల వ్యయంతో అన్న హంగులతో నూతన జిల్లా గ్రంధాలయ భవనాన్ని నిర్మించనున్నామని జిల్లా గ్రంధాలయ సంస్థ అధ్యక్షులు చంద్ర గౌడ్ తెలిపారు. గ్రంథాలయాల మీద మక్కువతో రాష్ట్ర ఆర్థిక శాఖామాత్యులు హరీష్ రావు, స్థానిక శాసనసభ్యులు పద్మాదేవేందర్ రెడ్డి కృషివల్ల మెదక్ పట్టణంలోని కోర్టు ప్రక్కన 38 గుంటల ప్రభుత్వ స్థలం కేటాయించారని, భవన నిర్మాణానికి నిధులు సమీకరిస్తున్నామని అన్నారు.

శుక్రవారం జిల్లా గ్రంధాలయంలో జరిగిన సంస్థ సర్వ సభ్య సమావేశంలో మాట్లాడుతూ మన రాష్ట్రంలో సిద్ధిపేట, సిరిసిల్లలో ఉన్న గ్రంధాలయ భవనాలకు దీటుగా సుమారు ఒక ఎకరా స్థలంలో అన్ని హంగులతో సర్వాంగసుందరంగా భవన నిర్మాణం గావించనున్నామని అన్నారు. అందులో భాగంగా 2022-23 బడ్జెట్ లో భవన నిర్మాణానికి 50 లక్షలు ప్రతిపాదించామని అన్నారు. ఇట్టి గ్రంథాలయాన్ని పూర్తి డిజిటలైజ్ చేస్తామని యువత కు పోటీ పరీక్షలకు సిద్ధం కావడానికి ఎంతో ఉపయోగపడతాయని అన్నారు. ప్రస్తుతమున్న గ్రంధాలయ భవనాన్ని పట్టణంలో యదావిధిగా కొనసాగిస్తామని అన్నారు. నరసాపూర్ పట్టణంలో కోటి రూపాయల వ్యయంతో నిర్మిస్తున్న భవనం తుది దశలో ఉన్నదని, రేగోడ్ లో 25 లక్షల వ్యయంతో గ్రంధాలయ భవన నిర్మాణానికి కలకత్తా లోని రాజారామ్ మోహన్ రాయ్ లైబ్రరీ ఫౌండేషన్ కు ప్రతిపాదనలు పంపామని అన్నారు. డిపార్ట్మెంట్ అఫ్ పబ్లిక్ లైబ్రరీ నుండి పోటీ పరీక్షలు, సైన్స్ ఫిక్షన్, మహిళలు, పిల్లల సాహిత్యం తదితర అంశాలకు సంబంధించి 585 పుస్తకాలు అందాయని, వాటిని జిల్లాలోని 15 శాఖా గ్రంథాలయాలకు, రెండు గ్రామీణ గ్రంథాలయాలకు పంపిణి చేయనున్నామని అన్నారు. పుస్తక పఠన ప్రియులకు గ్రంథాలయాలలో మంచి సాహిత్యం గల పుస్తకాలతో పాటు విద్యార్థులు పోటీ పరీక్షలకు ఉపయోగపడే ఎన్నో పుస్తకాలు అందుబాటులో ఉన్నాయని, అందరు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జిల్లాలో గ్రంథాలయాల పటిష్టతకు, అభివృద్ధికి అన్ని చర్యలు తీసుకుంటున్నామని దాతల సహకారంతో గ్రంథాలయాలను డిజిటలైజేషన్ చేయనున్నామని అన్నారు. తమ గ్రామాలలో గ్రంధాలయాలు నెలకొల్పుటకు ఆసక్తి గల గ్రామ పంచాయతీలు ముందుకు వచ్చి భవనం సమకూరిస్తే దాతల సహకారంతో కంప్యూటర్లు సమకూర్చి డిజిటల్ మెటీరియల్ తో నేటి సమాజానికనుగుణంగా అవసరమైన వ్యవసాయ, పోటీ పరీక్షలకు ఉపయోగపడే పుస్తకాలు, మాగజైన్లను అందిస్తామని చంద్ర గౌడ్ తెలిపారు.

జిల్లా పంచాయతీ అధికారి తరుణ్ కుమార్ మాట్లాడుతూ గ్రామ పంచాయితీల ద్వారా 4 కోట్ల 34 లక్షల పన్నులు వసూలు చేయాలని లక్ష్యంకాగా అందులో 8 శాతం సెస్ రూపంలో అనగా సుమారు 57 లక్షల ఆదాయం గ్రంథాలయాలకు వస్తుందని అన్నారు. ఈ నిధులు గ్రంథాలయాల పటిష్టతకు ఎంతో ఉపయోగపడతాయని అన్నారు.

ఈ సందర్భంగా 2022-23 సంవత్సరానికి భవన నిర్మాణాలకు, మరమ్మతులకు, పుస్తకాలు,మ్యాగజైన్లు , ఫర్నీచర్, కంప్యూటర్లు తదితర కొనుగోలు చేయుటకు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు జీతాలకై కోటి 58 లక్షల బడ్జెట్ కై పౌర గ్రంధాలయ శాఖా సంచాలకులు ప్రతిపాదనలు పంపుటకు సమావేశం తీర్మానించింది. అదేవిధంగా ప్రస్తుత గ్రంధాలయ భవనం లో నిర్మిస్తున్న అదనపు గదులను, శౌచాలయం పూర్తి గావించుటకు, బోర్ వేయుటకు 16 లక్షల అంచానా ఖర్చుకు సమావేశం తీర్మానించింది.

ఈ సమావేశంలో వయోజన విద్య ఉప సంచాలకులు రామేశ్వర్, డిపిఆర్ ఓ శాంతి కుమార్, సభ్యులు సిద్దిరాములు, అనూష, విజయలక్ష్మి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కరోనా వైరస్‌కు నాసల్ డ్రాప్స్‌తో చెక్.. భారత్ బయోటెక్‌కు డీసీజీఐ పర్మిషన్..

న్యూఢిల్లీ, జనవరి 28:భారత్ బయోటెక్ సంస్థకు డ్రగ్ కంట్రోల్ ఆఫ్ఇండియా మరో పర్మిషన్ ఇచ్చింది. ఇప్పటికే కొవాక్సిన్ రెండు డోసులు తీసుకున్న వ్యక్తులపై ఇంట్రానాసల్ బూస్టర్? డోస్ ఫేజ్ 3 క్లినికల్ ట్రయల్స్ నిర్వహించడానికి ఈ పర్మిషన్స్ ఇచ్చింది. కాగా, దేశంలోని తొమ్మిది ప్రదేశాలలో ఈ ట్రయల్స్ నిర్వహించనున్నారు. మాస్ టీకా డ్రైవ్‌లలో భాగంగా ఇంట్రానాసల్ వ్యాక్సిన్ బూస్టర్‌గా నిర్వహించడం సులభం అవుతుందని సంస్థ ప్రతినిధులు చెబుతున్నారు.

ముక్కులో వేసుకునే డ్రాప్స్ ఆధారంగా రూపొందించే ఈ వ్యాక్సిన్ ద్వారా ఎంతో మెరుగైన ఫలితాలు సాధించవచ్చని, వైరస్ అటాక్ చేసే ముక్కు ప్రదేశంలో నేరుగా డ్రాప్స్ వేయడంతో రోగనిరోధక ప్రతిస్పందనలను ప్రేరేపిస్తుందని నిపుణులు తెలిపారు. కొవిడ్ -19 సంక్రమణ, వ్యాప్తిని నిరోధించడంలో ఇది చాలా ప్రభావవంతంగా ఉంటుందని భారత్ బయోటెక్ తెలిపింది. నాసికా వ్యాక్సిన్‌ను ఎంత సులభంగా నిర్వహించవచ్చో, దానికి ఆరోగ్య కార్యకర్తల అవసరం కూడా ఉండదనే వాస్తవాన్ని గుర్తించాలని వారు తెలిపారు.

హైదరాబాద్‌కు చెందిన వ్యాక్సిన్ తయారీదారు గత నెలలో నాసికా వ్యాక్సిన్ యొక్క ఫేజ్ 3 ట్రయల్స్ నిర్వహించడానికి డ్రగ్ రెగ్యులేటర్ అనుమతిని కోరింది. భారత్ బయోటెక్ యొక్క కొవాక్సిన్, సీరమ్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇండియా యొక్క కొవిషీల్డ్ మార్కెట్‌లో అమ్మకానికి అనుమతి పొందిన వెంటనే ఈ తాజా పర్మిషన్ రావడం సంతోషించదగ్గ విషయం అని సంస్థ ప్రతినిధులు తెలిపారు. అయితే, ఈ రెండు వ్యాక్సిన్‌లు త్వరలో మెడికల్ షాపుల్లో కూడా అందుబాటులో ఉంటాయన్నారు.

ప్రపంచ సంస్థలతో అమూల్ పోటీ పడుతోంది : సీఎం జగన్

అమరావతి, జనవరి 28: అమూల్ ప్రపంచంతో పోటీ పడుతోందని ఏపీ సీఎం జగన్ మోహన్ రెడ్డి తెలిపారు. అందులో భాగంగానే ప్రతిష్టాత్మక ప్రాజెక్టు కోసం నేడు అమూల్‌తో రాష్ట్ర ప్రభుత్వం సీఎం జగన్ సమక్షంలో ఒప్పందం చేసుకుంది. అమూల్ ఆధ్వర్యంలో బాలామృతం తయారీ కేంద్రం ఏర్పాటు చేస్తామన్నారు. ప్రపంచంలో అమూల్ ఎనిమిదవ స్థానంలో ఉంది. అమూల్ ప్రపంచంతో పోటీ పడుతోందన్నారు. వ్యవసాయానికి పాడి తోడైతే లాభసాటి అని సీఎం జగన్ వెల్లడించారు. పాలు పోసే రైతులే అమూల్ సంస్థకి యజమానులన్నారు సీఎం. అంగన్ వాడీ కేంద్రాలకు అమూల్ పాలు, బాలామృతం అందిస్తామన్నారు. అనంతపురం జిల్లాలో 85గ్రామాల్లో పాలవెల్లువ. రాష్ట్రంలోని ఆరు జిల్లాల్లో పాల సేకరణ జరుగుతుందన్నారు సీఎం జగన్ అన్నారు.

కేసీఆర్ ఇజంను ప్రజల్లోకి తీసుకెళ్తా: ఎమ్మెల్యే వినయ్ భాస్కర్

హనుమకొండ, జనవరి 28:: సీఎం కేసీఆర్ ఇజంను ప్రజల్లోకి తీసుకువెళ్తానని ఎమ్మెల్యే వినయ్ భాస్కర్ అన్నారు. నగరంలో ఆయన మ

నూతన ఈవో ను కలిసిన తెదేపా నాయకులు -ఘనంగా సన్మానం

రాజన్న సిరిసిల్ల, జనవరి 28:(నేటినిజం ప్రతినిధి):వేములవాడ శ్రీ పార్వతి రాజరాజేశ్వర స్వామి ఆలయ కార్యనిర్వహణాధికారి గా బాధ్యతలు స్వీకరించిన రమాదేవి ని శుక్రవారం తెలుగుదేశం పార్టీ పార్లమెంటరీ నియోజకవర్గ ఇన్చార్జి పులి రాంబాబు గౌడ్, తెదపా రాష్ట్ర కార్యదర్శి తీగల శేఖర్ గౌడ్, సిరిసిల్ల వెంకటేశ్వర స్వామి దేవస్థానం చైర్మన్ విట్టల్ రెడ్డి ఆమెను మర్యాదపూర్వకంగా కలుసుకొని పూల బోకే అందజేసి శాలువా కప్పి ఘనంగా సన్మానించారు .

ఆలయ జాతర ఉత్సవాల కార్యక్రమానికి విరాళం అందజేసిన ఎంపిటిసి గాలి పెళ్లి సువర్ణ స్వామి

రాజన్న సిరిసిల్ల, జనవరి 28:(నేటినిజం ప్రతినిధి):వేములవాడ అర్బన్ మండలం కొడుముంజ గ్రామంలో శ్రీ రామప్ప రామలింగేశ్వర స్వామి వారి క్షేత్రంలో నిర్వహించనున్న జాతర ఉత్సవాల సందర్భంగా రుద్రవరం ఎంపీటీసీ గాలి పెళ్లి సువర్ణ స్వామి గౌడ్ రూ. 25. 00 విరాళాన్ని శుక్రవారం కొడుముంజ సర్పంచ్ కెరి రాజుకు అందజేశారు. గ్రామంలో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించడమే కాక ధార్మిక కార్యక్రమాలు సైతం తనవంతుగా విరాళం అందజేస్తు ఎంపీటీసీ తన భక్తిని చాటుకుంటున్నారు . ఈ సందర్భంగా ఆలయ కమిటీ ప్రతినిధులు ఎంపీటీసీకి ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతూ స్వామివారి ఆశీస్సులు ఉంటాయని పేర్కొన్నారు.

అవినీతిపరులు కావాలా - నిజాయితీపరుడు కావాలా 'కేజ్రీవాల్' సంచలన వ్యాఖ్యలు

న్యూఢిల్లీ, జనవరి 28:ఐదు రాష్ట్రాలలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. కాగా పలు రాజకీయ పార్టీలనీ తమ పార్టీనే గెలిపించే దిశగా వ్యూహాలు రచిస్తున్నాయి. ఈ మేరకు పంజాబ్ లో పాగా వేసేందుకు ఆమ్ ఆద్మీ పార్టీ యత్నిస్తోంది. కాగా ఇప్పటికే సీఎం అభ్యర్థిని ప్రకటించింది ఆమ్ ఆద్మీ. ఈ మేరకు ఆప్ అధినేత, ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ క్రేజివాల్ పంజాబ్‌లో మూడు రోజుల పర్యటనకు శ్రీకారం చుట్టారు. ఫిల్లౌర్ లో ఎన్నికల ప్రచారాన్ని చేపట్టారు. ఒకవైపు అవినీతి పరులు .. మరోవైపు నిజాయితీపరుడు పంజాబ్ అసెంబ్లీ ఎన్నికల ప్రచారం సందర్భంగా.. కాంగ్రెస్ , బీజేపీలపై అరవింద్ కేజ్రీవాల్ విమర్శలు గుప్పించారు.

కాంగ్రెస్ నేతలు అవినీతిలో కూరుకుపోయారన్నారు. వారి పాలనలో రాష్ట్ర అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగడి అక్కడే ఉందన్నారు. ప్రస్తుత అసెంబ్లీ ఎన్నికల బరిలో ఒకవైపు మాదక ద్రవ్యాల అక్రమ రవాణాకు పాల్పడ్డట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్నవారు, ఇసుక అక్రమ రవాణా ఆరోపణలు ఎదుర్కొంటున్నావారు ఉన్నారు. మరో వైపు ఎప్పుడూ ఎవరి నుంచి ఒక 25 పైసలు కూడా తీసుకోని వ్యక్తి పోటీలో ఉన్నారని కేజ్రీవాల్ తెలిపారు. పంజాబ్‌కు నిజాయితీగల సీఎం అవసరమని కేజ్రీవాల్ అన్నారు. ఆమ్ ఆద్మీ పార్టీ సీఎం అభ్యర్థి భగవంత్ మాన్ నిజాయితీపరుడని ఈసందర్భంగా తెలిపారు. ప్రజలు ఎవరు నిజాయితీపరుడో తెలుసుకోవాలన్నారు.

బూస్టర్ డోస్ ప్రయోగాలకు డీసీజీఐ అనుమతి

న్యూఢిల్లీ, జనవరి 28: భారత్ బయోటెక్ అభివృద్ధి చేసిన ఇంట్రా నాసల్ వ్యాక్సిన్ ను.. బూస్టర్ డోస్ గా పరీక్షించి చూసేందుకు భారత ఔషధ నియంత్రణ మండలి (డీసీజీఐ) శుక్రవారం అనుమతి మంజూరు చేసింది. దేశవ్యాప్తంగా తొమ్మిది ప్రాంతాల్లో నాసికా టీకాపై పరీక్షలు నిర్వహించనున్నారు. కొవాగ్జిన్, కొవిషీల్డ్ రెండు డోసులు తీసుకున్న వారికి ఇంట్రా నాసల్ టీకాను (చుక్కల రూపంలో) బూస్టర్ డోస్ గా ఇవ్వొచ్చని భారత్ బయోటెక్ చెబుతోంది. దీంతో విస్తృత స్థాయిలో ప్రయోగాలకు డీసీజీఐ నుంచి అనుమతి సంపాదించింది. మార్చి నెల నాటికి ఇంట్రా నాసల్ వ్యాక్సిన్ ను విడుదల చేసే అవకాశాలు ఉన్నట్లు భారత్ బయోటెక్ అంచనా వేస్తోంది.

5,000 మంది ఆరోగ్యవంతులైన వలంటీర్లపై భారత్ బయోటెక్ ఈ టీకాను ప్రయోగించి చూడనుంది. ఇందులో 2,500 మంది చొప్పున రెండు గ్రూపులు ఉంటాయి. ఒక గ్రూపు కొవిషీల్డ్ తీసుకున్న వారు కాగా, మరో గ్రూపు కొవాగ్జిన్ తీసుకున్నవారు. రెండో డోసు తీసుకుని ఆరు నెలలు అయిన వారిపై ప్రయోగించి చూడనుంది. ప్రయోగాల అనంతరం ఫలితాల నివేదికను డీసీజీఐ ముందు దాఖలు చేయాలి. అప్పుడు అత్యవసర అనుమతి లభించేందుకు అవకాశం ఉంటుంది.

బొగ్గు టిప్పర్, వ్యాను ఢీకొని ఇద్దరు మృతి

కొత్తగూడెం, జనవరి 28:: కొత్తగూడెం జిల్లాలో దారుణం జరిగింది. చండ్రుగొండ మండలం తిప్పనపల్లి గ్రామం వద్ద జాతీయ రహదారిపై బొగ్గు టిప్పర్, వ్యాను ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఇద్దరు కూలీలు అక్కడికక్కడే చనిపోయారు. పది మందికి పైగా తీవ్ర గాయాలయ్యాయి.

స్థానికులు వారిని సమీపంలోని హాస్పిటల్?కు తరలించారు. చనిపోయిన వారి వివరాలు తెలియాల్సి ఉంది. పోలీసులు సంఘటనా స్థలానికి వచ్చి పరిశీలించి కేసు దర్యాప్తు చేయనున్నట్టు తెలుస్తోంది.

మూడు రాజధానుల పిటిషన్లపై హైకోర్టులో విచారణ

అమరావతి, జనవరి 28: రాష్ట్రానికి మూడు రాజధానుల పిటిషన్లపై హైకోర్టులో విచారణ జరిగింది. మూడు రాజధానుల బిల్లులను వ్యతిరేకిస్తూ హైకోర్టులో పిటిషన్లు దాఖలయ్యాయి.

ప్రభుత్వం చట్టాలను ఉపసంహరించుకున్నా మళ్లీ ప్రవేశ పెడతామని పేర్కొనడంతో విచారణ కొనసాగించాలని న్యాయవాదులు కోరారు. పిటీషన్లలో ఏ అంశాలపై విచారణ కొనసాగించాలో అఫిడవిట్‌లు దాఖలు చేయాలని గతంలో త్రిసభ్య ధర్మాసనం ఆదేశించింది. అఫిడవిట్‌లు దాఖలు చేసి వాదనలను న్యాయవాదులు వినిపించారు.

సీఆర్డీఏ మాస్టర్ ప్లాన్ అభివృద్ధి, నిర్మాణం నిలిపివేసిన పనులు కొనసాగించడం, రైతుల ప్లాట్‌లను అభివృద్ధి చేయడం, రాజధాని నుంచి కార్యాలయాల తరలింపు నిలిపివేత అంశాలపై వాదనలను పిటిషనర్ల తరపు న్యాయవాదులు వినిపించారు. తదుపరి విచారణను ఫిబ్రవరి 2కి హైకోర్టు వాయిదా వేసింది.

పిటీషనర్ల తరపున శ్యామ్ దివాన్, రమేష్, జంద్యాల రవిశంకర్, వాసిరెడ్డి ప్రభునాథ్, అంబటి సుధాకర్ రావు, ఉన్నం మురళీదర్ , కె.ఎస్ మూర్తి, సత్యప్రసాద్ , ప్రసాద్ బాబు, కేఎస్ మూర్తి, ఇంద్రనీల్, తదితరులు వాదించారు.

నష్టాలతో ముగిసిన స్టాక్ మార్కెట్స్

న్యూఢిల్లీ, జనవరి 28:ఈ వారం స్టాక్ మార్కెట్స్ నష్టాలతో ముగిశాయి. అంతర్జాతీయంగా సానుకూలతలు ఉండటం, ఏసియన్ మార్కెట్లన్నీ రికవరీలో ఉండటంతో నేటి స్టాక్ మార్కెట్స్ లాభాలతో ప్రారంభం అయినా చివరికి నష్టాలతో ముగిశాయి. అయితే ఇన్వెస్టర్లు చివరిలో లాభాల స్వీకరణకు మొగ్గు చూపడంతో చివరకు నష్టాల్లో ముగిశాయి.

నేటి ట్రేడింగ్ ముగిసే సమయానికి సెన్సెక్స్ 76 పాయింట్లు నష్టపోయి 57,200కి పడిపోయింది. నిఫ్టీ 8 పాయింట్లు కోల్పోయి 17,101 వద్ద స్థిరపడింది. ఎన్టీపీసీ (3.89%), సన్ ఫార్మా (1.85%), ఇండస్ ఇండ్ బ్యాంక్ (1.72%), మహీంద్రా అండ్ మహీంద్రా (1.38%), విప్రో (1.37%) బీఎస్ఈ సెన్సెక్స్ టాప్ గెయినర్స్ నిలిచింది. మారుతి సుజుకి (-2.99%), టెక్ మహీంద్రా (-2.43%), పవర్ గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (-2.14%), ఐసీఐసీఐ బ్యాంక్ (-1.62%), యాక్సిస్ బ్యాంక్ (-1.08%) టాప్ లూజర్స్ గా నిలిచింది.

అమెరికాలో మేయర్‌గా బాధ్యతలు స్వీకరించిన భారత సంతతి

న్యూఢిల్లీ, జనవరి 28:భారత సంతతికి చెందిన వ్యక్తి.. అగ్రరాజ్యం అమెరికాలోని ఓ సిటీ మేయర్‌గా బాధ్యతలు స్వీకరించారు. దీంతో ఆ పదవిని చేపట్టిన తొలి ఆసియన్ అమెరికన్ ఆయన గుర్తింపు పొందారు. ఇందుకు సంబంధించిన పూర్తి వివరాల్లోకి వెళితే..ఓహియో రాష్ట్రంలోని సిన్సినాటి నగర మేయర్ ఎన్నికలు కొద్ది రోజుల క్రితం జరిగాయి. ఈ ఎన్నికల్లో డెమొక్రటిక్ పార్టీ తరఫున పోటీకి దిగి, భారత సంతతికి చెందిన అఫ్టాబ్ కర్మ సింగ్ పురేవల్(39) విజయం సాధించారు. సిన్సినాటి నగర మేయర్‌గా ఎన్నికయ్యారు. ఈ క్రమంలోనే తాజాగా ఆయన సిన్సినాటి నగర మేయర్‌గా ప్రమాణస్వీకారం చేశారు. దీంతో ఈ పదవిని చేపట్టిన తొలి ఆసియన్ అమెరికన్‌గా అఫ్టాబ్ కర్మ సింగ్ పురేవల్ గుర్తింపు పొందారు. ఈ కార్యక్రమానికి స్థానికంగా ఉన్న ఇండియన్ అమెరికన్లతోపాటు టిబెటియన్ దేశస్తులు కూడా హాజరయ్యారు. ఇదిలా ఉంటే.. అఫ్టాబ్ కర్మ సింగ్ పురేవల్ తండ్రి ఇండియన్ కాగా.. ఆయన తల్లి టిబెటియన్. ఈయన ఓహియోలో జన్మించి అక్కడే పెరిగారు.

నూతనంగా బాధ్యతలు స్వీకరించిన సబ్ ఇన్స్పెక్టర్‌ను సన్మానించిన ఎమ్మార్పీఎస్ నాయకులు

రాజన్న సిరిసిల్ల, జనవరి 28:(నేటినిజం ప్రతినిధి):వేములవాడకు నూతనంగా బాధ్యతలను స్వీకరించిన సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ నాగరాజు ని శుక్రవారం ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులుమర్యాదపూర్వకంగా కలిసి రాజరాజేశ్వర స్వామి చిత్రపటాన్ని అందించి శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా సెక్రటరీ తాండ్రల తిరుపతి మాదిగ. ఎంఎస్ఎఫ్ జిల్లా కో ఆర్డినేటర్ సుంకపాక దామోదర్ మాదిగ ఎమ్మార్పీఎస్ మండల నాయకుడు ఎడపల్లి స్వామి అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షుడు ఎడపల్లి మహేష్ , గ్రామ శాఖ అధ్యక్షుడు ఎడపల్లి విష్ణు తదితరులు పాల్గొన్నారు

మారేపల్లి దళితుల మీద పెట్టిన అక్రమ కేసులను వెంటనే ఎత్తివేయాలి...!

-19మంది మీద నాన్ బెయిల్ కేసులు 13మంది జైలుకు.
-మద్యం బెల్ట్ షాప్ ఓనర్ లను వెంటనే అరెస్ట్ చేయాలి.
-కల్తీ మద్యం తాగి చనిపోయిన 5కుటుంబాలకు 25లక్షల నష్టపరిహారం ఇవ్వాలి.
-మారేపల్లి గ్రామాన్ని సందర్శించిన కెవిపిఎస్, సిపిఎం, సిఐటియు నాయకులు.

సంగారెడ్డి జనవరి 28 (నేటినిజం ప్రతినిధి) కొండాపూర్ మండలం మారేపల్లి గ్రామ దళితులపై అక్రమంగా పెట్టిన నాన్బెయిలబుల్ కేసుల్లో జైలుకు ఉన్న బాధితుల కుటుంబాలను ఈరోజు కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కెవిపిఎస్), సిపిఎం, సిఐటియు నాయకులు పరామర్శించారు..

ఘటనకు దారి తీసిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం అంబేద్కర్ విగ్రహం ముందు న్యాయం చేయాలని నిరసన వ్యక్తం చేశారు

ఈ సందర్భంగా కెవిపిఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు అతిమేల మాణిక్ మాట్లాడుతూ జనవరి 17వ తేదీన నరసింహులు అనే దళితుడు మద్యం తాగి బెల్ట్ షాప్ ముందు చనిపోయినాడు ఆ కుటుంబాన్ని ఆదుకోవాలని బెల్టుషాపులు నిషేధించాలని అడిగినందుకు 19 మంది దళితులు పైన అక్రమంగా నాన్బెయిలబుల్ కేసులు పెట్టడాన్ని తీవ్రంగా ఖండించారు. 13 మంది దళితులు జైల్లో మగ్గుతున్నారని,అందులో నలుగురు మహిళలు ఉన్నారని అన్నారు.

ఇంత దారుణం ఎక్కడ ఉండదని అన్నారు. కళ్ళు పూర్తిగా కనిపించని శ్రీలత అనే అమ్మాయి పైన 60 ఏళ్ల ముసలామె పైన కేసు పెట్టడం చూస్తే ఎంత కుట్ర దాగి ఉందని అన్నారు.చిన్న గ్రామంలో 6 బెల్ట్ షాపులు ఉన్నాయంటే మద్యం మత్తు ఏ

రూపంలో అర్థం అవుతుందని అన్నారు. బెల్ట్ షాప్ మద్యం దుకాణాల వల్ల అనేకమంది మద్యానికి బానిస అవుతున్నారని, ఇప్పటికే గ్రామంలో తాగుడుకు బానిసై కుటుంబాల్లో తగాదాలు వచ్చు ఐదు మంది చనిపోయినారు. బెల్టుషాపుల తో అనేక కుటుంబాలు రోడ్డున పడుతున్నాయన్నారు

బెల్టు షాపులపై చర్యలు తీసుకోవాల్సిన ఎక్సైజ్ శాఖ వసూళ్లు శాఖగా అధికారుల నిర్లక్ష్యం వల్ల ఇంతటి దారుణాలు జరుగుతున్నాయని అన్నారు. దళితుల మీద పెట్టిన అక్రమ కేసులను బేషరతుగా ఎత్తివేయాలని,ఈ ఘటనపైఉన్నత స్థాయి అధికారితో విచారణ జరపాలని చనిపోయిన 5 కుటుంబాలకు కుటుంబానికి 25 లక్షల చొప్పున పరిహారం ఇవ్వాలని బెల్టుషాపులు నిర్వహిస్తున్న వారిపై కఠినమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు దళితులకు న్యాయం జరిగే వరకు ఈ పోరాటం హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు మద్దూరి శివకుమార్, సిపిఎం మండల కార్యదర్శి రాజయ్య, సీఐటీయూ మండల కార్యదర్శి బాబురావు, కెవిపిఎస్ మండల నాయకులు బాలకృష్ణ గ్రామ అంబేద్కర్ సంఘం నాయకులు దళితులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

మరో రెండు టైగర్ రిజర్వ్ సెంటర్లు.. పులుల సంరక్షణకు పర్మిషన్ ఇచ్చిన కేంద్రం..

న్యూఢిల్లీ, జనవరి 28:దేశంలో మరో రెండు కొత్త టైగర్ రిజర్వ్ ఫారెస్టులు రానున్నాయి. ఈ రెండు కొత్త ప్రతిపాదనలతో మధ్య ప్రదేశ్ రాష్ట్రంలోని శివపురి, రతపానిలో రిజర్వ్ కేంద్రాలు ఏర్పడనున్నాయి. ఈ రెండింటికి ఏర్పాటుతో మధ్యప్రదేశ్ రాష్ట్రం అత్యధిక సంఖ్యలో పులులు ఉన్న రాష్ట్రంగా అవతరించింది. ఇప్పటికే ఆరు టైగర్ రిజర్వ్ లు, పది జాతీయ ఉద్యానవనాలు మధ్యప్రదేశ్‌లో విస్తరించి ఉన్నాయి. కాగా, శివపురిలో మాధవ్ నేషనల్ పార్క్ ను ప్రత్యేక టైగర్ రిజర్వ్ గా ఏర్పాటు చేసేందుకు ఆ రాష్ట్రం కేంద్రాన్ని పర్మిషన్ కోరింది. దీనితో పాటు ముఖ్యమంత్రి నుండి క్లియరెన్స్, ప్రజల ఆమోదం తర్వాత రతపాని వద్ద మరో టైగర్ రిజర్వ్ ఏర్పాటు చేయనున్నారు. ఈ రెండు కొత్త ప్రాజెక్టుల ఏర్పాటు వెనుక సింధియా రాజకుటుంబం, పౌర విమానయాన మంత్రి జ్యోతిరాదిత్య సింధియా హెల్ప్ చేశారు.

కొన్ని నెలల క్రితం మంత్రి మాధవ్ నేషనల్ పార్క్ యొక్క ఔచిత్యాన్ని ఉదహరిస్తూ కేంద్ర పర్యావరణ మంత్రి భూపేంద్ర యాదవ్‌కు లేఖ రాశారు. "200 సంవత్సరాలకు క్రితం నుంచే మాధవ్ నేషనల్ పార్క్ పులుల సంఖ్యను కలిగి ఉంది. ఈ ప్రాంతం పూర్వపు గ్వాలియర్ రాజకుటుంబానికి రిజర్వ్ పార్క్‌గా ఉండేది. పెద్ద సంఖ్యలో పులుల ఆవాసంగా ఉంది. అందుకని ఇక్కడ మరో టైగర్? రిజర్వ్? కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. దీనికి స్పందించిన కేంద్ర పర్యావరణ మంత్రి.."టైగర్ సఫారీని ప్రారంభించడంతో పాటు మాధవ్ నేషనల్ పార్క్ ను టైగర్ రిజర్వ్ గా అభివృద్ధి చేసేందుకు అధికారులు సుముఖత వ్యక్తం చేశారు. మాధవ్‌లో టైగర్ సఫారీ కోసం మధ్యప్రదేశ్ ప్రభుత్వం చేసిన ప్రతిపాదన సెంట్రల్ జూ పరిశీలనలో ఉంది. అథారిటీ, టైగర్ రిజర్వ్ ప్రతిపాదన పరిశీలిస్తున్నాం ''అని ఆయన ప్రతిస్పందనలో తెలిపారు.

రాబోయే 5 సంవత్సరాల్లో మాధవ్ నేషనల్ పార్క్ లోని 1600 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో టైగర్ రిజర్వ్ ను అభివృద్ధి చేయాలి. ప్రారంభంలో టైగర్ సఫారీని 100 హెక్టార్లలో ఏర్పాటు చేయాలి. ఒక సంవత్సరం లోపు సఫారీ కోసం మౌలిక సదుపాయాల అంచనా వ్యయం దాదాపు 20 కోట్ల రూపాయలు ఉంటుంది అని సీనియర్ అటవీ అధికారి చెప్పారు.

ముస్లిం కమిటీని సన్మానించిన తెదేపా నాయకులు పులి రాంబాబు గౌడ్..

-సన్మానించినందుకు పులి రాంబాబు గౌడ్‌కు కృతజ్ఞతలు తెలిపిన ముస్లిం కమిటీ

రాజన్న సిరిసిల్ల, జనవరి 28:(నేటినిజం ప్రతినిధి):వేములవాడ నూతన ముస్లిం కమిటీ ని శుక్రవారం పట్టణంలోని మహమ్మదీయ మజిద్ లో తెలుగుదేశం పార్టీ పార్లమెంటరీ నియోజకవర్గ ఇన్చార్జి పులి రాంబాబు గౌడ్ ఘనంగా సన్మానించారు ముందుగా ముస్లిం కమిటీకి శుభాకాంక్షలు తెలుపుతూ.. అధ్యక్షుడు మహమ్మద్ అక్రమ్ కు పూల బోకే అందజేసి శాలువా కప్పి సన్మానించారు. అనంతరం ముస్లిం కమిటీ సభ్యులకు శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ముస్లిం కమిటీ ఉపాధ్యక్షులు సయ్యద్ రసూల్,కోశాధికారి షేక్ రియాజ్, జెయింట్ క్యాషియర్ ఖాజా నయముద్దిన్, ఆర్గనైజింగ్ సెక్రటరీ షబ్బీర్,జాయింట్ ఆర్గనైజింగ్ సెక్రెటరీ షాహిద్ పాష,ముఖ్య సలహాదారులు యం. ఏ మన్నాన్, యం. డి.పీర్ మొహమ్మద్, జల్ఫేఖర్ హుస్సేన్, కమిటీ కార్యవర్గ సభ్యులు ఇమ్రాన్, షకీల్ రహీం రమీజ్ పాష, గౌస్ బాబా, అసద్,మనీద్ కమిటీ అధ్యక్షులు షేక్ ఇమామ్, అబ్దుల్ రజాక్ తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగులు ఆత్మహత్య చేసుకోవద్దు: ఈటల

మహబూబాబాద్, జనవరి 28:: నిరుద్యోగులు ఆత్మహత్య చేసుకోవద్దని ఎమ్మెల్యే ఈటల రాజేందర్ సూచించారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రభుత్వం తక్షణమే ఉద్యోగ నోటిఫికేషన్లు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఇది మాటల ప్రభుత్వమే తప్ప.. చేతల ప్రభుత్వం కాదని తప్పుబట్టారు. కేంద్రం బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీకి నిధులు కేటాయించకపోతే.. రాష్ట్ర ప్రభుత్వమే ఏర్పాటు చేస్తామన్న మాట ఏమైంది? అని ఈటల ప్రశ్నించారు. ప్రతి విషయంలో కేంద్రంపై నెపం వేయడం సరికాదన్నారు. టీఆర్ఎస్ ప్రభుత్వానికి పతనం తప్పదని ఈటల రాజేందర్ హెచ్చరించారు.

నా హెలికాప్టర్‌ను ఢిల్లీలో ఆపేశారు: అఖిలేష్ ఫైర్

న్యూఢిల్లీ, జనవరి 28: ఢిల్లీ నుంచి ఉత్తరప్రదేశ్‌లోని ముజఫర్‌నగర్ వెళ్లడానికి తన హెలికాప్టర్‌ను అనుమతించ లేదని సమాజ్‌వాదీ పార్టీ చీఫ్ అఖిలేష్ యాదవ్ శుక్రవారంనాడు తెలిపారు. ఇది బీజేపీ కుట్రేనని ఆరోపించారు. "ఏ కారణం లేకుండానే నా హెలికాప్టర్‌ను ఢిల్లీలో ఆపేశారు. ముజఫర్‌నగర్ వెళ్లేందుకు అనుమతించ లేదు. ఇప్పుడే బీజేపీ అగ్రనేత ఒకరు ఇక్కడి నుంచి వెళ్లారు. ఓడిపోతామని తెలిసే ఇలాంటి కుట్రలు సాగిస్తున్నారు. ప్రజలు ప్రతీదీ గమినిస్తున్నారు" అని అఖిలేష్ ఓ ట్వీట్‌లో పేర్కొన్నారు.

యడియూరప్ప మనవరాలు ఆత్మహత్య!

బెంగళూరు, జనవరి 28:: కర్ణాటక మాజీ సీఎం బీఎస్ యడియూరప్ప మనవరాలు సౌందర్య మృతి చెందింది ఈ రోజు (జనవరి 28 శుక్రవారం) ఉదయం 10 గంటలకి బెంగుళూరులోని ఓ అపార్ట్ మెంట్‌లో ఆమె మృతి చెందిన విషయాన్ని పోలీసులు గుర్తించారు. ఈ కేసును అనుమానాస్పద మృతిగా పోలీసులు రిజస్టర్ చేసుకున్నారు. కాగా, ఆమె ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలుస్తోంది.

ఆమె వయసు 30 సంవత్సరాలు. యాడియూరప్ప పెద్ద కూతురు పద్మ కుమార్తె సౌందర్య. రెండేళ్ల క్రితం ఆమెకు వివాహమైంది. డాక్టర్ నీరజ్‌తో ఆమెకు వివాహం జరగ్గా, నాలుగు నెలల పాప కూడా ఉంది. మృతిరిత్యా సౌందర్య డాక్టర్.. ఎంఎస్ రామయ్య ఆసుపత్రిలో ఆమె పనిచేస్తోంది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బౌరింగ్ ఆస్పత్రికి తరలించారు. సౌందర్య మృతదేహాన్ని బెంగళూరు ఉత్తర అబ్బిగెరె నీరజ్‌ఫామ్ హౌజ్‌కు తరలించి అక్కడ అంత్యక్రియలు నిర్వహించనున్నారు.

రాజన్న హుండీ ఆదాయం రూ.55లక్షలు

రాజన్న సిరిసిల్ల: వేములవాడ రాజరాజేశ్వరస్వామి దేవస్థానానికి హుండీల ద్వారా రూ. 55 లక్షల 16 వేల 998 ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో రమాదేవి తెలిపారు. ఎనిమిది రోజులుగా భక్తులు హుండీల్లో సమర్పించిన కానుకలను రాజన్న ఆలయంలోని ఓపెన్‌స్లాబ్‌లో గురువారం అత్యంత భద్రత మధ్య లెక్కించారు. ఈ సందర్భంగా 55 లక్షల 16 వేల 998 రూపాయల నగదు, 65 గ్రాముల 250 మిల్లిగ్రాముల బంగారం, 3 కిలోల 180 గ్రాముల వెండి సమకూరినట్లు ఈవో పేర్కొన్నారు. ఈవో రమాదేవి, ఏఈవోలు హుండీ లెక్కింపును పర్యవేక్షించారు.

మేడారం జాతర పనులను ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయి పరిశీలన : కలెక్టర్ కృష్ణ ఆదిత్య

వరంగల్, జనవరి 28:మేడారం జాతర పనులన్నీ యుద్ధ ప్రాతిపదికన శాశ్వత నిర్మాణాలకు ప్రాధాన్యతనిస్తూ జనవరి నెలాఖరు వరకు పూర్తి చేసే విధంగా అన్ని శాఖల అధికారులను సమన్వయం చేసుకుని క్షేత్రస్థాయిలో ఎప్పటికప్పుడు పరిశీలన చేయడం జరుగుతుందని ములుగు జిల్లా కలెక్టర్ కృష్ణ ఆదిత్య తెలిపారు. శుక్రవారం కలెక్టర్ కాన్ఫరెన్స్ హాల్ నందు నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ? మేడారం వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా శాశ్వత నిర్మాణాలకు ప్రాధాన్యతనిస్తూ సకల సౌకర్యాలు కల్పిస్తున్నామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా వ్యాక్సినేషన్ కార్యక్రమం పూర్తి చేయడంలో ములుగు జిల్లా ఆరో స్థానంలో ఉందన్నారు. జిల్లాలోవ్యాక్సినేషన్ ను ముమ్మరంగా కొనసాగుతుందని, మొదటి డోసు వాక్సినేషన్ 100శాతం పూర్తి చేశామన్నారు. పాత్రికేయులందరూ మేడారానికి సంబంధించిన ఏమైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలని, వెంటనే సమస్యల పరిష్కార దిశగా కృషి చేస్తామన్నారు. పాత్రికేయులు వారి కుటుంబ సభ్యులు ఆరోగ్య పరిరక్షణ ధ్యేయంగా కరోనా నిబంధనలు పాటించాలన్నారు. ఇందులో భాగంగా స్వయంగా జిల్లా కలెక్టర్ వైద్య ఆరోగ్య శాఖ అధికారులతో మాట్లాడి కలెక్టర్ కార్యాలయంలో వ్యాక్సినేషన్ సెంటర్ ఏర్పాటు చేసి బూస్టర్ డోస్ వాక్సినేషన్ పాత్రికేయులకు అందించే విధంగా చర్యలు చేపట్టారు.

కేంద్ర బడ్జెట్‌లో బీసీలకు లక్షకోట్లు కేటాయించండి

హైదరాబాద్, జనవరి 28: కేంద్ర బడ్జెట్ సమావేశాల్లో బీసీల అభివృద్ధి, సంక్షేమానికి లక్షకోట్లు కేటాయించాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం కాచిగూడలోని అభినందన్ గ్రాండ్‌లో బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ అధ్యక్షతన బీసీ కుల సంఘాల ప్రతినిధుల సమావేశం జరిగింది. కృష్ణయ్య మాట్లాడుతూ దేశ జనాభాలో 56 శాతం ఉన్న బీసీలకు కనీసం 5 శాతం బడ్జెట్ కేటాయించరా? అని ప్రశ్నించారు.

గతేడాది కేంద్రం బీసీలకు రూ.1,050 కోట్లు మాత్రమే కేటాయించిందని, ఇది దేశంలో 70 కోట్ల మంది బీసీలకు పంచడానికి బిస్కెట్లు కూడా రావని ఎద్దేవాచేశారు. బడ్జెట్‌లో బీసీలకు లక్షకోట్లు కేటాయించని పక్షంలో దేశవ్యాప్తంగా ఆందోళనలు, ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. బీసీ సంక్షేమానికి కేంద్రంలో ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలని, జనగణనలో బీసీ కులగణన చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కోల జనార్దన్, మట్ట జయంతిగౌడ్, నీల వెంకటేశ్, మల్లేశ్‌యాదవ్, రాజేందర్, అంజి, బబ్లూ, శివ, చంటి, భాస్కర్, జగదీశ్ తదితరులు పాల్గొన్నారు.

పంజాబ్ సీఎం అభ్యర్థిపై త్వరలో ప్రకటన:పైలట్

న్యూఢిల్లీ, జనవరి 28: పంజాబ్ కాంగ్రెస్ ముఖ్యమంత్రి అభ్యర్థి పేరును కార్యకర్తలతో సంప్రదించి త్వరలోనే పార్టీ ప్రకటిస్తుందని ఆ పార్టీ నేత సచిన్ పైలట్ తెలిపారు. పంజాబ్‌లో భిన్నమైన పరిస్థితి ఉండటం, ముఖ్యమంత్రి అభ్యర్థిని ప్రకటించాలని పార్టీ కార్యకర్తలు కోరుతుండటంతో కార్యకర్తలతో సంప్రదించి త్వరలోనే అభ్యర్థి విషయంలో ఒక ప్రకటన చేస్తామని రాహుల్ గాంధీ చెప్పినట్టు పైలట్ తెలిపారు.

ఇవి కూడా చదవండిఎఎజీనవ అజీజూబితినీనిడబ్బు కోసం తల్లిని వదిలేసిన క్రూరుడంటూ సిద్ధూపై ఆరోపణలుసీఎం అభ్యర్థి పేరు ప్రకటించాలని ముఖ్యమంత్రి చరణ్ జిత్ సింగ్ చన్నీ, పార్టీ చీఫ్ నవజ్యోత్ సింగ్ సిద్ధూ గురువారంనాడు రాహుల్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు. జలంధర్‌లో జరిగిన వర్చువల్ ర్యాలీలో రాహుల్ ఈ ప్రస్తావన చేస్తూ, ఎవరి సారథ్యంలో పంజాబ్